అయిదవ తిరుమొழ్ధి

శ్రీః

ఆழ்వార్ ఎంబెరుమానార్ ఆణ్డాళ్ తిరువడికళే శరణమ్

# *మన్ను పెరుమ్ పుకழ். 5*

(కోకిలని ప్రార్థించటం)

ఫాల్గునమాసం వరకు కామదేవార్చన చేసిన తరువాత సంశ్లేషాన్ని కలుగ జెయ్యమని సంశ్లేషాన్ని ప్రార్థించినా, తనవద్దకి కృష్ణుడు వచ్చి కలవటం దానితో ఈమె సంతోషంగా ఉండటం జరగలేదు. ఇదివరకు కృష్ణుడుకూడా ఈమెముందుకి వచ్చి ఈమెతో కలుస్తానని చెప్పివెళ్ళేడు. వెనుకటి తిరుమొழ்ధిలో "ఓ సంశ్లేషమా, నీవు కృష్ణుడితో నాకు సంశ్లేషమును కలిగించుమా" అంటూ ఎన్నిసారులు మొఱ పెట్టినా ఆ సంశ్లేషం తాను వీరిద్దరినీ కలుపుతానని గాని, ఆయన వచ్చి కలుస్తున్నాడనిగాని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో చెప్పలేదు. ఈసంశ్లేషం అన్నది అచేతనం గనుక చెప్పలేకపోయిందని భావించింది. వసంతఋతువు వస్తోంది. పొన్నలు, మల్లెలు, కోంగుచెట్లు, మామిడిచెట్లు మొదలైనవన్నీ చిగురుతొడిగి పూతకి సిద్ధంగా ఉన్నాయి. కోకిలలు కూయటం మొదలుపెట్టేయి. మనతోటలో నున్న కోకిల మననే బాధిస్తున్నదే అనిఅనుకున్నది. తనకి అనుకూలమయ్యేలాగ దానిని ఉపయోగించుకోవాలని అనుకున్నది. దగ్గరనే ఉన్న కోకిలని చూచింది. కృష్ణుడూ, తానూకలిసి ఉన్న కాలంలో ఈ కోకిల దగ్గరగాఉండి తాము మాటలాడు కుంటూంటే ఆమాటలనే తిరిగిచెప్పినట్లు కూయటంచేస్తూ ఉండేది. ఆ అలవాటుతో "ఓ కోకిలా! నన్నూ, ఆకృష్ణుడినీ నువ్వు కలపవచ్చు గదా! ఎలాగైనా ఆయన నాదగ్గరకు వచ్చి నాతో సంశ్లేషించేటట్టు నువ్వు కూసి ఆయనతో చెప్పవచ్చు గదా" అని ఎన్నోసార్లు ఆకోకిల కాళ్ళమీదపడి దానిని కృష్ణుడివద్దకువెళ్ళి దౌత్యంచెయ్యమని కోరుతోంది ఈతిరుమొழ்ధిలో. రామాయణంలో సీతాదేవి రావణాసురుడితో "నువ్వు సుఖంగా జీవించాలనుకుంటే రాముడికి స్నేహితుడివి కావచ్చును, ఆయన ధర్మజ్ఞుడని లోకానికంతటికీ తెలుసును"అన్నది అంటే నువ్వుగాని రాముడివద్దకు వెళ్ళి నువ్వు ఆయనతో మిత్రత్వాన్ని ఆశిస్తున్నావని చెపితే ఆయన ధర్మాన్ని తెలిసినవాడుగనుక, తప్పకుండా నిన్ను మిత్రుడిగా స్వీకరిస్తాడు. రాముడికి నువ్వు మిత్రుడివయి నన్నూ, ఆయనతో చేర్చవచ్చును

గదా"అని ఆమెభావించిందంటారు పెరియవాచ్చాన్పిళ్ళై. వస్తున్నానన్న కృష్ణుడు వచ్చిచేరేటట్లు ఆయనని ఇదిపిలిస్తే, దీనిపిలుపు ఆయన చెవిని పడి ఎక్కడినుంచి కోకిలకూత వినబడుతోందో తెలుసుకునేశక్తి చెవికి ఉన్నదిగనుక ఇక్కడ నాదగ్గరకి రావాలని తెలుసుకొని ఆయనవస్తాడని కోకిలని అడుగుతోంది. దీన్ని తెలియ చెప్పటమే ఈతిరుమొழிలోని విషయం. ఇందులోని పాశురాలనన్నింటినీచూస్తే విషయం ఇదేనని తెలుస్తుంది. "కామార్తా హి ప్రకృతికృపణాః చేతనాచేతనేషు" అని చెప్పినట్లు, ఈ కోకిల వెళ్ళి ఆయనని పిలవగలదా? లేదా అనే వివేకం లేకుండానే ప్రేమాంధుడు అచేతనాన్నికూడా ఆజ్ఞాపిస్తాడు. కాని ఇక్కడ వివేకంతో ఆజ్ఞాపించినట్లు భావించినా, తప్పులేదని భావనచెయ్యవచ్చంటారు ఉత్తమూర్ వారు. ఇక్కడ సంశ్లేషాన్నాశ్రయించి తనకికావలసిన ప్రాప్యాన్నిపొందలేక వ్యథని చెంది తిర్యక్కైనకోకిలని ఆశ్రయిస్తున్నది అని అవతారిక చెప్పటంకూడా ఉన్నది.

మూ. మన్ను పెరుమ్పుకழ் మాతవన్మామణివణ్ణన్మణిముడిమైన్దన్
తన్నైయుకన్దతుకారణమాక వెన్శఙ్గిழక్కుమ్ వழక్కుణ్డే
పున్నైకురుక్కత్తిఞాழల్ శెరున్దిపొదుమ్బినిల్వాழுఙ్కుయిలే
పన్నియెప్పోదుమిరున్దువిరైన్దెన్పవళవాయన్ వరక్కూవాయ్. 1

ప్రతిపదార్థం: పున్నై= పొన్నచెట్లును కురుక్కత్తి= మాధవీలతకాని, కురుక్కత్తిచెట్లును శెరున్ది= శెరున్ది-సురపొన్నవృక్షములును ఞాழల్= కోంగు చెట్లును లేక మల్లె కాని కుంకుమపువ్వుమొక్కల పొదుమ్బినిల్= (పూవుల)తోటలో ఎప్పోదుమ్= ఎల్లప్పుడును పన్ని ఇరున్దు= తిరునామములను అభ్యసించుచునే ఉండి వాழுమ్ కుయిలే= జీవించుచున్న ఓకోకిలా! మన్ను= నిత్యమైన(స్థిరముగా నున్న) పెరుమ్=అంతులేని(గొప్పదైన)పుకழ்=కీర్తినిగల మాతవన్= శ్రియఃపతియు, మామణివణ్ణన్= నీలమణివంటి విగ్రహకాంతిగలవాడును మణిముడి= నవరత్న ఖచితమైన కిరీటము గలవాడును మైన్దన్తన్నై= మేనబావయైన కృష్ణుని ఉకన్దతు= నేను కోరియుండుట కారణమాక= కారణముగా ఎన్శఙ్గు ఇழక్కుమ్= నాచేతి కంకణముజారిపోవుటగురించి వழక్కు= కారణమునుతెలిసికొనుటయనునది ఉణ్డే= కలిగినది. విరైన్దు= తొందరగా వర= వచ్చునట్లు ఎన్= నాయొక్క పవళవాయన్=

***పగడము వంటి అధరములు గలవానిని కూవాయ్= రమ్మని పిలువుమా!***

**వ్యాఖ్యానం: మన్ను పెరుమ్ పుకழ్: ఆస్వామిలో** ఎద్దైనా తక్కువవటంచేత నేనాయనకటాక్షాన్ని పొందలేకపోతున్నానా? లేక నాలో ఏమైనా తక్కవైందా? అవిరెండూ కావే! ఎలా అంటే, రామానుజులవారు శరణాగతిగద్యలో సాయించినట్లు "స్వాభావిక, అనవధిక, అతిశయ, అసంఖ్యేయ, కల్యాణగుణగణౌఘ" అని సాయించిన ప్రకారం ఆయన కల్యాణగుణాలు ఆయనకి సహజంగా ఉన్నవినీ్న, ఇంత అనిగాని ఇన్ని అనిగాని లెక్కించిచెప్పటానికి సాధ్యంకానంతగా అన్నీ ఉన్నవాడు. ఆయనకున్నకీర్తి ఏదో ఒకనాడుండి మరునాడు లేనిది కాక, నిత్యమైనదిగా గలవాడని మన్ను పెరుంపుకழ్అని సాయించటం జరిగిందన్నారు పెరియవాచ్చాన్పిళ్ళై. - ***లోకంలో అందరిచేతా, నిందించబడేవాడును,*** పిచ్చెక్కించే వాడును కళ్ళతోచూడలేని వికారమైన రూపంఉన్నవాడున్నూ, అందరికంటెనూ తక్కువవాడును, అయిన ఒకచెడ్డమనిషిని నేనాశపడిఉంటే, ఏమిచెడినా బాధలేకపోవును. కాని ఆయన మన్నుపెరుమ్ పుకழ్గలవాడు. అంతేకాదు, ఆయన మాదవన్ - అంటే శ్రీదేవీవల్లభుడు. ఆఅమ్మకి తగినవాడు ఆమెఅంటే అతివాల్లభ్యం గలవాడు. ఆమెవిషయమా - ఆనాడు సీతాదేవిగా అవతరించి తననిబాధించిన రాక్షసస్త్రీలని హనుమ శిక్షిస్తానన్నప్పుడు వాళ్ళుబాధపెట్టటం వాళ్ళనాయకుడి ఆజ్ఞానుసారం చేసినదేతప్ప అది వాళ్ళతప్పుకాదంటూ వాళ్ళనిరక్షించింది. ఆ తల్లి ఉంటూ కూడా నాకు సహాయం లేకుండా అయిపోయిందే అని ఆండాళ్ విచారిస్తున్నది. ఇంకా ఆయన మామణివణ్ణన్ - అంటే "న తే రూపం, న చాకారో నాయుధాని న చాస్పదమ్। తథాపి పురుషాకారో భక్తానాం త్వం ప్రకాశసే" అని జితంతేస్తోత్రంలో సాయించబడినప్రకారం ఆయన దివ్యాత్మస్వరూపమూ, దివ్యమంగళవిగ్రహమూ, ఆయన దివ్యాయుధాలూ, ఆయన వేంచేసి ఉండే దివ్యవైకుంఠమూ ఇవేవీ తన కోసం కాదట; అవన్నీ తన భక్తులకోసమేననీ, తాను ఉన్నదే తన భక్తులకోసమేననీ చెప్పబడుతోందే! నాలుగుదిక్కుల్లోనూ వ్యాపించిన నిత్యమైన కీర్తిగలవాడున్నూ, సాక్షాత్తు లక్ష్మీదేవివల్లభుడై చూసేవాళ్ళ కళ్ళు హాయిగా చల్లగా అయేటట్లున్న నీలమణివంటి వర్ణంగలవాడున్నూ, మణిముడిమైన్దన్- ఇన్నీ ఉన్నా నాలాగ ఇతరులఆనుమతికోసంఎదురుచూసి సోగొట్టుకున్నానా? ఆయన స్వతంత్రుడే! "అందరినీ రక్షించి కటాక్షించుతానని" నిశ్చయించుకొని కిరీటాన్నిపెట్టుకున్నవాడే! పోనీ, రక్షిస్తానని బాధ్యత తలకెత్తుకున్నా, ఆయనేనమైనా అశక్తుడా అంటే, ఆయన

మైన్దన్- అంటే శక్తిమంతుడు. రక్షిస్తానని సంకల్పించి దానిని తెలిపేటట్లు కిరీటం ధరించినవాడునూ, తనసంకల్పానుసారంగా పూర్తి చెయ్యగల సమర్థతగలవాడును అయిన ఎంబెరుమానుడిని నేను ఆశించి, ఈ దుఃఖానుభవాన్ని పొందుతున్నాను. ఇది న్యాయమా? లోకం ఇలాగనే వ్యవహరిస్తున్నదా? అని అంటున్నది పాశురం తాలూకు మొదటి రెండు పాదాల్లో. ***ఓ కోకిలా!*** నీవు శ్రియఃపతితిరునామాన్నే ఎప్పుడును అనుసంధిస్తూ దగ్గరలోనున్న పొన్న, శెరుంది మొదలైన చెట్లతోనిండి ఉన్న పూలతోటలో ఉంటున్నదానివేగదా! అందుకే నువ్వు ఆ కృష్ణుడు తొందరగా నాదగ్గరకు వచ్చేటట్లు వెంటనే కూయాలి. ***ఎన్శఙ్గు ఇళ్ళక్కుమ్ వళ్ళక్కు ఉణ్ణో?*** శఙ్గు ఇళ్ళక్కల్ అంటే చేతిగాజులు జారిపోవటం. నాయకుడిని విశ్లేషించి బాధపడుతున్నందువలన శరీరం చీల్చివేయ బడుతున్నట్లు కృశించిపోగా "చేతులకి సరిపోయినట్లుగా వేసుకున్న గాజులుకూడా వదులైపోయి జారిపోతాయి. "యామి నయామీతిధవే వదతిపురస్తాత్ క్షణేన తన్వఙ్గ్యాః। గళితాని పురోవలయాని అపరాణి పునస్తథైవదళితాని" అన్నశ్లోకం తాత్పర్యం ఇక్కడ అనుసంధేయం. అంటే, నాయకుడు నాయకిని చూచి, ఓ నేత్రానందదాయినీ, నిన్నువదిలి ఒక ఊరికి వెళుతున్నాను" అని చెప్పిన క్షణం లోనే ఆమెచేతికి తొడుగుకున్న గాజుల్లో ఇదివరకే ఉన్నగాజులు జారిపోయి క్రిందికి పడిపోయినాయి. అదిచూచిన నాయకుడు "ఈమె మా విరహాన్ని సహించలేదు. అందుచేత నేను ఈమెను వదలి వెళ్ళలేను అని అనుకొని వెంటనే నేను వెళ్ళటం లేదు అని చెప్పటమేమిటి, వెంటనే చేతినుంచి జారిపోతున్న గాజులు చటుక్కున బిగిసిపోయి ముక్కలు ముక్కలై పడిపోయినాయి- అని వెనుకచెప్పిన శ్లోకానికి అర్థం. నాయకుడి విరహం ప్రస్తావనకి వచ్చినంతమాత్రానికే నాయకిశరీరం చాలాకృశించిపోతుందనిన్నీ, ఆవిశ్లేషవార్త మారిపోగానే శరీరం ఆనందంతో పొంగిపోతుందనీచెప్పటం దీని భావం. అందుచేత ఇక్కడ "ఎన్శఙ్గిళ్ళక్కుమ్ వళ్ళక్కుణ్ణో" అన్నప్రయోగం ఎంబెరుమానుడిని నేను ఎల్లప్పుడూసంశ్లేషించే శరీరాన్ని నిండుగా ఉంచుకొనటం లభించవలసి ఉండగా, ఈవిధంగా స్వామిని విశ్లేషించి కృశించి బాధపడుతుండటం న్యాయమేనా? అని అడుగుతున్నదన్న మాట. అన్యాయంగా నేను ఆయనకోసం ఎదురుచూస్తూ చిక్కిపోతున్నాను. నాచేతి నున్న కంకణాలు ఎట్లా వదులై జారిపోతున్నాయో చూడు! "నువ్వేం చేస్తున్నావు" అంటావేమో - ఏంచేసేది? ఆయనదగ్గరనున్న ప్రతీవిషయాన్నీ చూసి, సంతోష

పడి పోతున్నాను. ఒక్కసారికూడా నేను ఏతప్పున్నూ చెయ్యలేదు. మొదటనే ఆయనతాలూకు నిరుపాధికమైన వాత్సల్యం మొదలైనగుణాలనిచూసి ఎంత సంతోషించేను! ఆ వాత్సల్యంఉన్నా, నావిషయంలో అది ఫలించకపోవటానికి కారణాలైన ఆటంకాలు తొలగటానికి ఆయన, పురుషకారభూతురాలైన పిరాట్టితో వేంచేసి ఉండడం చూసి ఎంత సంతోషించేను! ఆ కల్యాణగుణాలూ, పిరాట్టీ, ఆయననే నేను పొందేటట్లు చెయ్యాలని నేను ఆశపడేటట్లు చేసిన నీలమణివంటి విగ్రహాన్నీ, ఆయనతోటే ఉండి అనుభవించటానికి ఏమీ లోటురానివిధంగా ఉండే ఆ రత్నఖచితకిరీటధారియొక్క ఐశ్వర్యాన్నీ, ఆటంకాలని తొలగించేటటువంటి అనుభవించతగిన గొప్పతనాన్నీచూసి చాలాసంతోషించేను. ఈవిధంగా సంతోషంగానున్న నాకు ఈకంకణాలతోపాటుఇంకా ఎన్నోకంకణాలనిపెట్టి హాయిగా ఉండవలసినవాడు ఉన్న కంకణాలనే జారిపోయేటట్లు చేసేడు.

ఆయన నాకోసం ఈపాట్లన్నింటినీ పడవలసి ఉండగా, నేను ఆయనకోసం ఆశపడి క్రుంగి కృశించిపోయేటట్లు విధివైపరీత్యంగదా! అని బాధపడుతున్నదని కావచ్చు. ఆయనశ్రీపాదపద్మాలమీద తలని చేర్చి ఆపాదాశ్రితులకి ఎదురయ్యే దుఃఖాలని ఆస్వామే అనుభవించవచ్చు. కాని అది విపరీతమై నేనే దుఃఖాలను అనుభవించవలసివస్తున్నదే అనిఅంటోందనికూడా చెప్పవచ్చు. భారత యుద్ధంలో అర్జునుడిమీద పడబోతున్న బాణాలని శ్రీకృష్ణుడు ఆయన్ని పక్కకి నెట్టివేసి తన మీదపడేటట్లు చేసుకున్నాడుగదా! "పార్థం సంఛాద్య మాధవః ఉరసా ప్రతిజగ్రాహ" అనికదా ఉన్నది. అలాంటిది నామీద ఆయనకటాక్షం ఎందుకు ప్రసరించటం లేదో అని ఆండాళ్‌తల్లి అడుగుతున్నది.

వழக்கு ఒణ్డే- వழக்கு అంటే న్యాయం. ఇట్లా నేను బాధపడేటట్లు ఆయన ఉపేక్షించటం న్యాయమేనా? అని అడుగుతున్నది. "అఱివినాల్ కుఱైవిల్లా అకల్ ఞాలత్తవరఱియ నెఱియెల్లామెడుత్తురైత్త నిఱై ఞానత్తొరుమూర్‌త్తి" అని చెప్పినట్లు న్యాయాలనన్నింటినీ అభ్యసించిన ఆయనే ఇట్లా అన్యాయం చెయ్యటానికి సిద్ధ పడటం న్యాయమేనా? తననిఆశించినవారికి కృశించిపోయి కంకణాలు జారి పోవటమే లభిస్తుంది" అంటూ ఇలాంటిన్యాయం ఒకటి ఆయనిచ్చిన శాస్త్రాల్లో ఎక్కడైనా ఉన్నదా? అని అడుగుతున్నది. "న వాసుదేవభక్తానాం అశుభం విద్యతే క్వచిత్" అనిన్నీ, "కౌన్తేయ ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి" అనిన్నీ, ఆయన చెప్పిన గీతాశాస్త్రంలో వింటున్నామే తప్ప "వైకున్దనడిపణిన్దార్ వళైయిழప్పు

వరున్దువరే" అన్నట్టుగా ఒక్కచోటకూడా ఇంతవరకూ వినలేదే! అంటున్నట్టున్న దన్నమాట.

ఇక మూడవపాదంలో, ఓ కోకిలా అని పిలచి దానితో చెప్పుకుంటున్నది. ఇది అతనికి న్యాయమా? కాదని నువ్వు కూడా అంగీకరిస్తున్నావుకనుక, నువ్వు ఒక్కొక్క చెట్టుమీదా ఉండి ఒక్కొక్క తిరునామాన్నీ చెప్పుతూ కూతకూసి, అతనిని పిలవాలి అనిఅంటున్నది.

పున్నై ఇత్యాది: ఓ కోకిలా, నేను ఈ పాట్లన్నీ పడుతూంటే, నాలాగే నువ్వుకూడా బాధ పడటమో లేక నాబాధని పోగొట్టటమో చెయ్యవలసిఉండగా, పొన్నచెట్టు, కురుక్కత్తి, ఞాళ్ళల్, శెరున్ది మొదలైన వృక్షాలమీదఏర్పరచిన గూళ్ళలో పడకమీద, హాయిగా బతుకుతున్నావా? ఇది బాగుందా? నేనేమో "మెన్ మలర్ప్పళ్ళి వెమ్పళ్ళియాలో"అని బాధపడుతున్నపుడు నాఎదరగా నువ్విట్లా హాయిగా బ్రతకటమా? అన్న ఉపాలంభం తెలిపేలాగ సంబోధిస్తున్నది. ఞాళ్ళల్ అన్నా నాళ్ళల్ అన్నా ఒకటే. సంస్కృతంలో ఇది ప్రియఙ్గూ అనిన్నీ, ఫలినీ అనిన్నీ చెప్పబడుతుంది.

సరేలే ఇది ఇలా ఉండనీ. ఇప్పుడు నువ్వు ఏంచెయ్యాలో విను అంటూ ఆకోకిల ఏమిచెయ్యాలో చివరిపాదంలో చెప్పబడుతోంది. ఒకసారిచెప్పి ఊరుకొన కుండా, ఆయన మనస్సుకి పట్టేటట్లు ఎన్నోసారులుచెప్పి, గజేంద్రుడు చిక్కుకున్న సరస్సుఒడ్డుకి గాభరాగాభరాగా కట్టుబట్టయినా సరిగాఉన్నదాలేదా అనికూడా లెక్క చెయ్యకుండా ఆగజేంద్రుడినిరక్షించాలని తొందరతొందరగా వచ్చేవే, అట్లావేగంగా నాదగ్గరకువచ్చి నాతోసంశ్లేషించేవిధంగా ఆయనని ఈకోకిల పిలవాలని కోరుకుం టున్నది. "ఎన్పఱ్పనాబన్వరక్కూవాయ్- నాపద్మనాభుడు రావాలని కూయుమా" అనీ, "ఎన్పరమపురుడన్ వరక్కూవాయ్- నాపరమపురుషుడిని రమ్మని కూత పెట్టు" అనిన్నీ ఇంకా మిగిలిన తిరునామాలని చెప్పకుండా "ఎన్ పవళ వాయన్' 'అనిచెప్పటంలో ఉన్న స్వారస్యాన్ని పెరియవాచ్చాన్పిళ్ళై సాయిస్తున్నారు. నాతో సంశ్లేషించినప్పుడుకౌగలించుకొని, చిరునవ్వునవ్వి, తానువచ్చేంతవరకూ జీవించిఉండేలాగ ప్రాణాధారజలాన్నిపొందుతున్నప్పుడు నవకంతో, అధరాలమీద ఎర్రదనంతో, వచ్చి కౌగలించుకొనేటట్లు నువ్వు ఆయనని పిలవాలి అని అంటున్న దంటారు. పవళవాయన్ - కోకిలని నోరువిప్పి గట్టిగా కూయమని చెప్పినప్పుడు పగడాలవంటి ఆయన అధరాలనే తలుచుకుంటున్నాను, ఆఎర్రటి అధరాలుగల

నోటిమాధుర్యాన్ని అనుభవించే తీరాలితప్ప మాటలతో ఆదివ్యాధరాలవిశేషాన్ని చెప్పటానికేసాధ్యంకాదుగదా! అందుకే కోకిలకూతకూయాలి అంటున్నదన్నమాట.

నాలుగవపాదంలో నీవు దివ్యనామానుసంధానంచేస్తూ తొందరగా కూయటం చెయ్యాలని అన్వయం చెప్తారు. కాని నామానుసంధానంతో కూయాలి అనికూడా అన్వయం చెప్పవచ్చును. 1

అవతారిక: రెండవ పాశురం. తన తక్కువతనాన్ని తెలియజేస్తేకదా దానికి పరిహారం కనుక్కునేది! ని పరిస్థితి ఇలా ఉన్నదికాబోలు అని అంటున్నది.

**మూ. వెళ్ళైవిళిశఙ్జిడజ్జైయిల్కొణ్డవిమలనెనక్కురుకాట్టాన్ ( క్కాణుమ్**
**ఉళ్ళమ్పుకున్దెన్నైనైవిత్తునాళుముయిర్పెయ్‌తుకూత్తాట్టు**
**కళ్ళవిழ் శెణ్బకప్పూమలర్‌కోతిక్కళిత్తిశైపాడుఙ్గుయిలే!**
**మెళ్ళవిరున్దుమిழற్ఱిమిழற్ఱాతెన్‌వేఙ్గడవన్‌వరక్కూవాయ్ 2**

ప్రతిపదార్థం: ***కళ్***= తేనె ***అవిழ்***= కారునట్లున్న ***శెణ్బకమ్ పూమలర్***= సంపెంగ పూవుయొక్క వికసించిన భాగాన్ని ***కోతి***= ముక్కుతో త్రెంపి ***కళిత్తు*** =మదించి ***ఇశైపాడుమ్ కుయిలే!***= పంచమస్వరంలో పాడే ఓ కోకిలా! ***వెళ్ళై***= తెల్లదియును ***విళి***= కావలసినవారిని పిలిచేటటువంటి ***శఙ్గు***= శ్రీపాంచజన్యమనే శంఖమును ***ఇడమ్ కైయిల్***= ఎడమచేతిలో ***కొణ్డ***= ధరించియున్న ***విమలన్***= నిర్మలుడైన స్వామి ***ఎనక్కు***= ఆయనను సేవించవలెనని ఎదురుచూస్తున్న నాకు ***ఉరు***= తన దివ్యమంగళవిగ్రహాన్ని ***కాట్టాన్***= ఆయనంతట ఆయనే వచ్చి చూపించనివాడై ***నాళుమ్***= ప్రతిరోజూ ***ఉళ్ళమ్ పుకున్దు***= నామనస్సులో తెలియకుండాప్రవేశించి ***ఎన్నై నైవిత్తు***= నన్ను బాధించి ***ఉయిర్‌పెయ్‌తు***= నేను నశించిపోకుండా చూస్తూ ***కూత్తాట్టు***= నేను తప్పి నృత్యం చేయటాన్ని ***కాణుమ్***= చూడటానికి వస్తున్నాడు. (అందుచేత నువ్వు) ***ఇరున్దు***= కూతకూసేటట్లు ఉండి ***మిழற்ఱాతే***= స్పష్టతలేకుండా కాక ***మెళ్ళ***= ఒక్కొక్క అక్షరం స్పష్టంగా తెలిసేవిధంగా నిదానంగా ***మిழற்ఱి***= గట్టిగా చెప్పి ***ఎన్ వేఙ్గడవన్***= నాస్వామియైన వేంకటాచలపతిని ***వర కూవాయ్***= రమ్మని చెప్పుమా!

వ్యాఖ్యానం: (రెండవ పాశురం.) ప్రథమార్థంలో తనని స్వామి ఏవిధంగా బాధిస్తున్నాడో చెప్పుతున్నది. మొదటిపాదంలో విమలన్ అనటం "నతేరూపం నచాకారో నాయుధాని నచాస్పదం, తథాపి పురుషాకారో భక్తానాం త్వం ప్రకాశసే" అని జితంతేస్తోత్రంలో సాయించినట్లు దివ్యాయుధాలు మొదలైనవాటిని ఆశ్రితులకోసమే ధరించియున్నా మని అనుకొనటమనే హృదయశుద్ధి గలవాడు అని చెప్పటమన్నమాట. విమలన్ - విగ్రహమున్నవాడు అనటంవల్ల జీవులవలె ప్రాకృతశరీరం పొందినవాడుకాదని చెప్పవచ్చును. దివ్య మైనరూపమున్నవాడ నటానికి తగినట్లుగా ఆయన అఖిలహేయప్రత్యనీకుడు. అంతేకాదు, ఇతరుల పాపాలని పోగొట్టేవాడు. తనవద్దకి అందరూ వచ్చేటట్లు పిలుస్తున్న దయామూర్తి. భక్తులను చేయిపట్టుకొని గట్టెక్కించటానికి అనుకూలంగాఉండటానికి అవతరించిన వాడు. నాకు తన దివ్యమంగళవిగ్రహాన్ని సేవింపజేయటంలేదనటంవల్ల నీళ్ళల్లో ఉండేచేపకి ఇంకానీరుపోసే వాడిలాగ నిత్యం స్వామిని సేవిస్తుండే నిత్యసూరులకి తననిసేవింపజేస్తూనే ఉంటాడనేచెప్తున్నది. ఆదివ్యమంగళవిగ్రహవైశిష్ట్యాన్ని తెలియని సంసారులకి చూపించటానికే ఉన్నాడనికూడా చెప్పవచ్చు. మనస్సులో ప్రవేశించి మననిశిధిలంచేయటం ఎలాచేస్తాడంటే, పెరియవాచ్చాన్పిళ్ళై సాయించినప్రకారం "మనస్సులోప్రవేశించి మరిఆయననిమరచిపోలేని విధంగా చేస్తాడు. దగ్గరగా ఉన్నాడనిపించి కౌగలించుకొనబోయి చేతులుచాచితే చేతులకి దొరకక, నిరాశచెంది, ఇకనశించిపోదామనుకుంటే అదీసాధ్యంకాక క్షణికమైన పదార్థాల్లాగ నశించటం, తిరిగి వెంటనే జీవించటం శరీరంబాధపడటం ఈవిధంగా జీవితంవెళ్ళబుచ్చటమేనా అనిపించి నిరాశతో శిథిలమయేటట్లుచేస్తాడు" అన్న మాట. వర్షాకాలమేఘంవంటి నీలమణివర్ణంగలశరీరంలో మీది భాగంలోఉన్నది, స్వచ్ఛమైనశంఖం. "నావలెనేమీరుకూడా కైంకర్యంచెయ్యటానికి వేంచేయండి" అనిపిలుస్తున్నట్లున్న శంఖారావంచేస్తున్న శ్రీపాంచజన్యాన్ని ఎడమచేతిలో ధరించి యున్నటువంటి ఎంబెరుమానుడు తనని సేవించటానికి చాలా ఆశతోనున్న నాకు తనదివ్యమంగళవిగ్రహాన్ని చూపించకుండా దాచిపెడుతున్నాడు. నాకుచూపించక పోతే ఆయన ఎవరికిచూపాలనుకుంటున్నాడు? చేపలకి నీటిని పారించేవారిలాగ నిత్యసూరులకి మాత్రమే చూపిద్దామని అనుకుంటున్నాడా? లేక, ఆ దివ్యమంగళ విగ్రహం గొప్పతనమే తెలియని సంసారులకు చూపుదామని ఉన్నాడా? "కాశి నొళియిల్ తికழ்ుమ్ వణ్ణజ్ఞాట్టీర్, ఎమ్బెరుమాన్ వాశివల్లీర్, ఇన్దళూరీర్ వాழ్న్దేపోమ్

నీరే - బంగారపుకాసు మెరిసిపోతున్నట్లున్న తన దివ్యమంగళవిగ్రహాన్ని నాకు చూపటంలేదు. ఓస్వామీ, మీవిగ్రహాలీవినీ, దాన్నిపొందే మాలోకుల నైచ్యాన్నీ వీటిని గమనించలేకపోతున్నారే ఈలోకులు! తేడాచూపకుండా, భేదం లేకుండా, అందరికీ సేవసాయించటానికి వేంచేసినచోటనే మీగొప్పతనాన్ని చెప్పదల్చిన వారైతే, మీదివ్యమంగళవిగ్రహాన్ని దేవరవారే ఇక్కడే-ఇందళూరిలోనే వేంచేసి సేవింపజేయవచ్చునే!" అని తిరుమఙ్గైయాళ్వార్ సాయించినట్లు, స్వామిని సేవించటమే జరగటంలేదు. ఆయన ఇట్లా ఉపేక్షించటంచేత తనని మరిచిపోయి నశించిపోదాం అనిచూసినా, అదీ సాధ్యంకావటంలేదు. నామనస్సులో ప్రవేశించి ప్రతీతలంపులోను, మాటలోను మనస్సుశిధిలంచేసి నీరుకార్చేస్తున్నాడ"న్నట్టుగా శైధిల్యాన్నికలిగించి ఆ కలతచేత ప్రాణాలుపోయే స్థితివచ్చేసరికి "ఇంతటితో ఈమెని ప్రాణాలుపోయేలాగ చెయ్యటమా? ఇంకా చాలాకాలం బాధపెట్టవద్దా!" అనిఅనుకొని, మరొకసారికూడా ప్రాణాలు కాస్తకుదుటపడేలాగచేసి, ఇదివరకటి లాగనే హింసించటానికి ఇట్లాశిధిలంచేయటం; ఇదే తానుచేసే పనిగా ఉన్నాడు.

తెల్లని దక్షిణావర్తశంఖం ఎడమచేతిలోపట్టుకొనిఅన్నారు - అయితే కుడిచేతిలో ఏమున్నదంటే -వలక్కైయాழிయిడక్కైచ్చఙ్గమ్- శ్రీసుదర్శనచక్రం - లేకపోతే ఇడఙ్గై వలమ్బురినిన్ఱార్ప్ప అనిచెప్పినట్లు ఎడమచేతిలోశంఖం, కుడిచేతిలోచక్రం ధరించి(శంఖాన్ని చెప్పడం శంఖచక్రాలను చెప్పినట్లేనంటారు పెరియవాచ్చాన్పిళ్ళై) తానుకూడా తెల్లనిశంఖంలాగనే నిర్మలుడై స్వచ్ఛంగా ఉన్నాడని తెలియచేసి, అందరూవచ్చి తనను సేవించుకొనటానికై తిరుమలై వేంకటాచలంమీద వేంచేసి ప్రకాశిస్తున్నాడాయన. ఇక నావిషయంచూడండి, ఆయనదగ్గరకి నేను వెళ్ళలేక, నేనున్నచోటికి ఆయనే రావలసిన స్థితిలో ఉన్నాను. అందువల్లనేఆయన నాకు తన విగ్రహాన్ని చూపలేక పోతున్నట్లున్నది.

తిరుమలదాకావచ్చినవాడు ఇక్కడికిరాలేడా? రాలేదన్నమాట కూడా లేదే! నాలో ప్రవేశించేడుకదా! ఇలా నన్నుపాట్లు పెడుతున్నవాడు నారూపే లేకుండా చేసిఉంటే బాగానే ఉండును. అలా చెయ్యకుండా ఎప్పటికప్పుడే బ్రతికే ఉండే టట్లు చేస్తున్నాడు. అంటే, ఇన్నిదెబ్బలు కొట్టాలని దోషులని దండించేవారు అన్నిదెబ్బలూ పూర్తయేలోపల ఆయాసంవస్తే వాడినోట్లో ఇన్నిమంచినీళ్ళు పోసి, తెలివితెప్పించి మరీ కొట్టేవాడిలాగ ముందుముందు బాధించటానికి మధ్య మధ్యని తననిచూసేరన్నట్టు అనిపింపచేస్తున్నాడు. అప్పుడు సేవించేనని ఆనందించటం,

దగ్గరగా కౌగలించబోతే కనబడకపోయి, నేను గాభరాపడుతుంటే అదిచూసి దగ్గరకి వస్తున్నాడు. ఇందుచేత ఆయనకి నామీదప్రీతిఉన్నదని బాగాతెలుస్తోంది. అందు చేతనే నువ్వు ఆయనదగ్గరకివెళ్ళి ప్రత్యక్షంగా రావాలని పిలవాలి. పిలిచినప్పుడు నిదానంగా, ప్రతి అక్షరాన్నీ విడివిడిగా పలికి పిలవాలి. ఎందుకంటే, ఆయన ఎంతో దూరంలో వేంకటాచలంలో ఉండటంచేత నువ్వుగాని స్పష్టంగాచెప్పకపోతే, "విషయమేమిటో నాకుసరిగ్గా తెలియలేదే" అంటాడు ఆయన స్వచ్ఛమైన వాడవటంవల్ల గౌరవంతోనే పిలవాలి. ఇట్లా నిదానంగా పిలవటానికి నీకు కష్టంగా ఉన్నది. నువ్వు తేనెకారుతున్న పువ్వునితిని సంతోషంతో గానంచేసి, నన్ను బాధ పెడుతున్నావు. నాకు అనుకూలంగా ఈ అవకాశాన్ని ఉపయోగించుకో. తేనెని త్రాగి, మత్తులో ఎలా పడితే అలా పిలవకు అని అంటున్నదన్నమాట.

నాళుమ్ ఉయిర్పెయ్దు- నడివీధిలో స్తంభంపాతి, దోషులనిదానికి కట్టి కొరడాతోకొట్టేటప్పుడు ప్రాణాలు పోతాయా అనిపించేదాకా కొట్టి, తరువాతవాడికి మంచినీళ్ళు అవీ ఇచ్చి కాస్త తేరుకున్నాక మళ్ళీ కట్టికొట్టటం చేస్తారు. మళ్ళీ ఇక ప్రాణాలు పోతాయనేసరికి ఇదివరకటిలాగనే చన్నీళ్ళు వాడిముఖంమీదజల్లి తెలివి తెప్పించి చల్లని నీళ్ళిచ్చి తేరుకోగానే కొడతారు. అలాగ పోయే ప్రాణాలని మళ్ళీ వెనక్కి తెప్పించి బాధిస్తాడని అழ்ధకియమణవాళజీయర్ సాయించేరు.

ఓ కోకిలా! నేనిట్లా బాధపడుతూంటే, నువ్వుమాత్రం హాయిగా ఆనందంగా పాటపాడుకుంటూ జీవించటం న్యాయమేనా? తేనెలూరుతున్న పువ్వులలో పనికి రాని(అసారమైన)దాన్ని పక్కకిబెట్టి, సారమైనభాగాన్ని అనుభవిస్తూ అందువల్ల కలిగినఆనందం లోపలఇమడక దాన్నిపాటగా వెలికితెస్తున్నావే, ఇదేనా మంచి తనం? నాదుఃఖాన్ని పోగొట్టినతరువాతగదా నువ్వు ఆనందంగా ఉండాలి! "నీకోసం నేనేం చెయ్యాలి" అని అడుగుతున్నావా? ఎప్పుడూ నాకు దగ్గరగా ఉంటూ ఏవో మధురమైనమాటలని చెప్పటం విలాసచేష్టితాలని చెయ్యటం చేస్తూంటావే! అలాకాకుండా సీతాపిరాట్టిని పరిణయమాడేందుకు మిథిలానగరానికి వచ్చిన పెరుమాళ్ళను ఇలాగే నాలుగడుగులు నడచివచ్చేలా నువ్వు పిలవాలని కోరుతున్నది. పరమపదాన్నివదలి తిరుమలలో వేంచేయటాన్ని తనని వివాహం చేసుకునేందుకే అని భావిస్తున్నదంటారు పెరియవాచ్చాన్పిళ్ళై.

మిழ்ధற்றி మిழ்ధற்றாదే- మిழ்ధற்றల్ అంటే ప్రేమతో చెప్పటంగాని, గాభరాగా చెప్పటంగాని కావచ్చు. ఇక్కడ మిழ்ధற்றిఅన్నప్పుడు మొదటిఅర్థం, రెండవ

పదానికి రెండోఅర్థం చెప్పవచ్చు. మిழற்றி - మృదుమధురమైన మాటలు చెప్పి, మిழற்றாదే - వెర్రి చేష్టలు చెయ్యకుమా అనికూడా అర్థం చెప్పటం ఉన్నది. 2

అవతారిక: పిరాట్టి అవతారమైన పద్మావతిని పొందటంకోసం పాట్లు పడుతున్న తిరువేంగడముడైయాన్ తనమీద దయచూపుతాడని నమ్మి, ఆయనని పిలవమని చెప్పింది వెనుకటి పాశురంలో. ఇక తరువాతిపాశురంలో సీతాపిరాట్టిని పొందటంకోసం సేతువునునిర్మించి రాక్షసరాజైన రావణుడిని సంహరించిన మహా వీరుడిని పిలవమని అడుగుతోంది.

***మూ. మాతలితేర్మున్బుకోల్కొళ్ళ మాయనిరావణన్మేల్ శరమారి***
***తాయ్తలైయழற்றற்றுవీழத్తొడుత్త తలైవన్ వరవెజ్గుమ్ కాణేన్***
***పోతలర్ కావిల్ పుతుమణమ్నాఱ పొఱివణ్డిన్కామరజ్గేట్టున్***
***కాతలియోడుడన్వాழ்కుయిలేయెన్కరుమాణిక్కమ్వరక్కూవాయ్***

ప్రతిపదార్థం: ***పోతు***= పువ్వులు ***అలర్***= వికసించియుండు ***కావిల్***= తోటలో ***పుతు మణమ్ నాఱ***= క్రొంగొత్త వాసనలు వీస్తుండగా ***పొఱివణ్డిన్***= అందమైన తుమ్మెదయొక్క ***కామరమ్ కేట్టు***= గానాన్ని విని ***ఉన్ కాతలి యోడు***= నీపై ప్రేమగల తుమ్మెద(కోకిల)తో ***ఉడన్***= కలిసి ***వాழ்కుయిలే***= జీవించే కోకిలా! ***మాతలి***= ఇంద్రుడి రథసారథియైనవాడు ***తేర్మున్బు***= రథానికి ముందు పగ్గంలో కూర్చొని ***కోల్ కొళ్ళ***= గుర్రములను నడిపించుచుండగా ***మాయన్ ఇరావణన్ మేల్***= మాయావియైన రావణాసురుడిమీద ***తాయ్తలై***= వాని ముఖ్యాంగాలైన తలలు ***అற்று అற்று వీழ***= ఒక్కొక్కటి నరకబడి క్రిందపడునట్లు ***శరమ్ మారి***= శరవర్షమును ***తొడుత్త***= నడిపించిన ***తలైవన్***= మహావీరుడు ***వరవు***= రావటం ***ఎజ్గుమ్***= ఏప్రక్కనుకూడ ***కాణేన్***= కనబడటం లేదు ***ఎన్ కరుమాణిక్కమ్***= నీలమాణిక్యంవంటి నా నాయకుడైనవాడు ***వర కూవాయ్***= వచ్చునట్లుగా నీవు పిలువుమా!

వ్యాఖ్యానం: (మూడవ పాశురం) మాతలి ఇత్యాది. మాతలి అంటే ఇంద్రుడి రథసారధి. ఎప్పుడూ యుద్ధరంగంలో ఇంద్రుడు వెన్నుచూపి పారిపోవటమే తప్ప ఒక్కనాడుకూడా యుద్ధంలో నిలిచి యుద్ధం చెయ్యలేదు. అందుచేత అతని

సారధికి కూడా యుద్ధంలో రథం నడపటం అనే అవకాశమే కలగలేదు. రావణసంహారంకోసం రాముడు అవతరించాడని అందరికీ తెలిసినా, ఒకవేళ రావణుడికే జయం లభిస్తే మనకి ఏమైయుండేదో అని భయపడి ఇంద్రుడు మొదట రథం పంపించకుండా ఊరుకున్నాడు. చివరికి అందరూ నశించి రావణుడొక్కడే మిగిలేసరికి నిర్భయంగా ఇంద్రుడు రాముడికి రధం పంపేడు. అటువంటి మాతలికి రాముడు రథంలో ఉండి యుద్ధం చేస్తూంటే తాను సారధిగా రథాన్ని నడిపే అదృష్టం కలిగింది. ధైర్యంగా రావణుడికి ఎదురుగా రథం మొగన కూర్చొని కొరడాపట్టుకున్నాడు. ఇదీ నాయకుడిసారధి ఉండవలసిన పద్ధతన్న మాట. మాయన్..తాయ్‌తలై - మాయన్ - రావణుడు మాయగాడు. ఎప్పుడూ వంచనతోనే యుద్ధంచేసేవాడు. సీతాదేవి వాడిని త్వం నీచశ్శశవత్ స్మృతః అన్నది పిరికివాడై రాజపుత్రులందరూ బాగా బలిష్ఠులై ఉంటారుగనుక, వాళ్ళనిద్దరినీ మారీచుడిసాయంతో దూరంగా పంపించివేసి, సీతాదేవి ఒంటరిగా ఉన్నప్పుడు తీసుకుపోయినవాడివి నువ్వా నేను గొప్పవాడిని అంటున్నావు, నీకూ రాముడికీ నక్కకీ సింహానికీ ఉన్నంత తేడా ఉన్నది. సింహం అంటే నన్నే సంహం అంటోందేమో అని ఎక్కడ అనుకుంటాడోనని, త్వం నీచశ్శశవత్ - నువ్వు కుందేలులాగ చాలా నీచుడివి అని స్పష్టం చేసింది. కృత్రిమమైన యుద్ధంలో ఆరితేరిన రావణుడు మాయారాముడిని సృష్టించి అతనితల నరికివేసినట్లు కల్పించి సీతని బాధించేడు, అలాచేసినందుకు శిక్షగా రాముడు మాతలి రథంమీద ముందు కూచుని కొరడాచేతిలో పట్టుకొని రథం నడుపుతూంటే, ఒకటికి పదిసారులు వాడిముఖ్యాంగాలైనతలలని నరికివేసి నేలపాలుచేసేడు. నరకబడ్డ తలగాని మాయాశిరస్సైయుంటే ముఖ్యాంగమే కాకపోవును. అలాకాకుండా, వాడు నిజంగా చచ్చిపోవటానికే గనుక, ఆతలలు ముఖ్యాంగాలైనాయి. అంటే నిజమైన తలలేనన్న మాట. మీదికెగిరిన ముఖ్యాంగాలైన నిజమైనతలలని చెప్పవచ్చు.దివ్యమైన శ్రీరాముడి బాణాలు పడినభాగ్యంచేత, ఆతలలు క్రిందపడడంతోటే వాడికి మళ్ళీ జీవం వచ్చేది. ఇక అదే పనిగా రాముడు బాణవర్షంతో వాడి తలలని నరికివేసి, వాడిని సంహరించేడు. ‘‘ఏవ మేకశతం ఛిన్నమ్’’ అని చెప్పినట్లు నూటొక్కతలలని కదా రాముడు నరికివేసేడు! రావణుడి మీద బాణాలు వర్షంపడుతున్నట్లువేసి వాడిశిరస్సులని ఛేదించి ఛేదించి నేలని పడవేసిన రాముడు హఠాత్తుగా ఏపక్కనించి వచ్చి కనబడుతాడో అని నేను చుట్టూ

చూస్తున్నా, ఆయన ఏదిక్కులోనూకుడా కనబడటం లేదు అంటోంది ఆండాళ్‌తల్లి. ఓ కోకిలా! నువ్వుకూడా నాబాధని గమనించటం లేదు! వికసిస్తున్న పువ్వులతో నిండుగాఉన్న తోటలు మనకి బాగా దొరికేయి అని ఈతోటల్లో ఉంటూ, మంచి పువ్వులవాసనలని అనుభవిస్తూ, కామరం అనే రాగాన్ని పాడుతూ తిరుగుతున్న తుమ్మెదల సంగీతసారస్యాన్ని అనుభవిస్తూ నీ జతఆడపక్షిని ఒకక్షణంకూడా వదిలి ఉండకుండా నిత్యసంశ్లేషంతో అదే ఆనందంలో మునిగిపోయి నాగురించి కొంచె మైనా తలుచుకొనకుండా ఉన్నావే! ఇది నీకు న్యాయమేనా? ఆస్వామి తన దివ్య మంగళవిగ్రహాన్ని నాకుచూపించి నన్ను తనకే చెందినదానినిగా చేసుకున్నాడు. అటువంటి ఆయన ఇక్కడికి వచ్చేటట్లు ఒకమంచి అందమైనపాటని పాడితే నీ ముత్యాలనోరు పడిపోతుందా? నా బంగారు కోకిలా! అలా ఒక్కసారి పిలచిపెట్టవా అని కోరుతున్నది.

తలైవన్ - ధీరోదాత్తుడు, వీరశ్రేష్ఠుడు. లేదా నాకు నాయకుడు. ఈ పదానికర్థం నశించని శిరస్సులుగలవాడు అనికావచ్చునే అనే సందేహం కలగ వచ్చు. మాయచేత నరక బడినట్లు అనిపించటమే తప్ప మాయాశిరస్సుంటే అది నిజానికి నరకబడదుగదా! వరవెఙ్గుమ్ కాణేన్ - వరవు+ఎఙ్గుమ్ అని విడ దీయాలి. ఎక్కడా రావటం కనబడటం లేదు అని అర్థం. కామరమ్ - సామాన్యంగా గానమని అర్థం. కామరం అనే ఒకవిధమైన గానం అనికూడా చెప్పవచ్చును. ఆయన విశ్లేషంవల్ల పువ్వులతోట, సువాసనలు, పాట, ఇవన్నీ నాకు బాధనికలిగిస్తున్నాయి. నువ్వు రమ్మనికూస్తే, ఆగానంవిని అందగాడైన ఆయనకూడా నీలాగనే ప్రియురాలైన నాతో హాయిగా జీవితంగడుపుతాడు అని అంటున్నదన్నమాట. 3

అవతారిక: నాలుగవ పాశురం. అవతారంలోమాత్రమే కనిపించి తరువాత మరి కనబడని విభవావతారాన్ని వెతకటం దేనికి? అవతారాలన్నింటికీ మూలకందమైన పరవాసుదేవమూర్తినే పిలవవచ్చును కదా అని అనుకొని ఈ పాశురాన్ని పాయిస్తున్నది ఆండాళ్‌తల్లి.

మూ. ఎన్బురుకియినవేల్ నెడుఙ్గణ్గళిమైపొరున్దాపలనాళుమ్
తున్బక్కడల్పుక్కు వైకున్దనెన్బతోర్‌తోణి పెఱాతుழழல్కిన్ఱేన్
అన్బుడైయారైప్పిరివుఱునోయతు నీయుమఱిదికుయిలే

**పొన్పురైమేనిక్కరుళక్కొడియుడైప్పుణ్ణియనైవరక్కూవాయ్.**

ప్రతిపదార్థం: **పలనాళుమ్**= చాలరోజులై (నాయొక్క) **ఎన్పు ఉరుకి**= ఎముకలు కరిగిపోగా **ఇనమ్వేల్**=మంచిఆయుధములవర్గమునకు చెందిన వేలాయుధము (బల్లెము)వంటి **నెడుమ్ కణ్గళ్**= పొడవైన నాకళ్ళును **ఇమైపొరున్దా**= రెప్పలు క్షణకాలంకూడా మూతపడటం లేదు **తున్బమ్ కడల్**= దుఃఖసముద్రంలో **పుక్కు**= మునిగి **వైకున్దన్ ఎన్బతు**= వైకుంఠనాథుడను **ఓర్ తోణి**= సాటిలేని తెప్పను **పెఱాతు**= పొందలేక **ఉళ్లల్ కిన్ఱేన్**= ఆ సముద్రంలోనే మునిగి తేలుతూ తత్తరపడుతున్నాను **కుయిలే**= కోకిలా! **అన్బుడైయార్**= ప్రేమించిన వారి **పిరివు ఉఱు**= విశ్లేషంచేత కలిగే **నోయ్ అతు**= అటువంటి బాధని **నీయుమ్ అఱిది**= నువ్వుకూడాతెలుసుకొన్నావు **పొన్ పురై**= బంగారువంటి **మేని**= విగ్రహంగలవాడును **కరుళన్ కొడి ఉడై**= తన జెండాపై గరుత్మంతుని గల **పుణ్ణియనై**= "ధర్మమే రూపుదాల్చినవాడ"ని చెప్పబడుతున్న కృష్ణుడిని **వరక్కూవాయ్**= ఇక్కడకు వచ్చునట్లు పిలువుమా!

వ్యాఖ్యానం: (నాలుగవ పాశురం) ఎన్పు ఉరుకి - నా ఈ విరహబాధ కేవలం పైపైన బాధించటం కాదు, ఎముకలకి పట్టిపోయింది. ఓ కోకిలా! స్వామికి దూరమైనందు వలన నాకుకలిగిన క్లేశం ఎక్కువకాగా, అది కేవలం శరీరానికే కాదుసుమా! నా ఎముకలన్నిటినీకూడా కరిగించేస్తున్నది. అంతేనా, "అనిద్రస్సతతం రామః" అనినీ, "ఉణ్ణాతుఅఙ్గాతు" అనినీచెప్పినట్లుగా నన్ను దూరంచేసుకొని ఆయన పడవలసిన పాట్లనీ నేనుగదా ఇప్పుడు పడు తున్నాను! ఇలా గడవటం ఒకరోజా, రెండురోజులా? ఎన్నాళ్ళైందో విశ్లేష దుఃఖసాగరంలో మునిగిపోయి ఈసాగరంలోంచిబైటపడటానికి "విష్ణుపోతం" అని ప్రసిద్ధి చెందిన తెప్ప దొరకక బాధపడుతున్నాను. "ఎన్నదాన్ విశ్లేషం నేర్న్దాలుమ్ ఇప్పడికూడనోవు పడలామో- ఎంతవిశ్లేషంకలిగినా ఇట్లాకూడా బాధపడాలా?" అని అనుకుంటున్నావా? అలా అనుకోకు. ఏదో భాగ్యంచేత నువ్వివాళ బాగావిరిసిన చిగుళ్ళని, పువ్వులని తుంచి తింటూ నీ జతపెంటితో విడిపోకుండా ఉన్నా, "సంశ్లేషాః విశ్లేషాన్తాః, విశ్లేషాః సంశ్లేషాన్తాః" అన్న

లెక్కలో ఇంతకు మునుపునువ్వుకూడా విశ్లేషించి దుఃఖించేవు.. ఇకమీదట ఎప్పటికీ నీకు విశ్లేషం కలగకుండా ఉండదు. అప్పుడు నువ్వు బాధపడక పోవు. కనుక, ఇతరులకి విశ్లేషంకలిగితే సహించలేనిదే అనే విషయంలో నీకు ఇదివరకే తెలుసునుగనుక, ఇప్పుడు నేను బాధపడు తుండటంగురించి నువ్వు అవహేళనంగా ఏమీ అనకు. ఈదుఃఖాన్ని తీర్చే ఉపాయమే ఇప్పుడు నువ్వు చెయ్యాలి. అంటే, గరుత్మంతుడిని ధ్వజంగా కల ఆపెరుమాళ్ ఇక వేంచేసి ఉండేటట్లు నువ్వు కూయాలి. బల్లెంచివరల్లా ఉన్ననాకళ్ళరెప్పలు క్షణకాలం కూడా మూత పడటమే లేదు. ఇటువంటి నాదశని చూసినవాళ్ళకి ఎన్నాళ్ళుగా నేను దుఃఖసాగరంలోములిగి బాధపడుతున్నానో తెలుసు కొనటం చాలాసులువు. ఈ సముద్రంలోంచి గట్టెక్క టానికి తెప్పగానున్నవాడు శ్రీవైకుంఠనాథుడే. ఆ తెప్ప దొరికితే ఒడ్డెక్కటం తప్పకుండా జరిగేదే. ఆయన కరుళక్కొడియుడై కదా! అంటే ఆర్తరక్షణకి కట్టుబడి ఉన్నవాడుకదా! సరస్సులో మొసలినోటికిచిక్కి బాధపడుతున్న గజేంద్రుడిని రక్షించటానికి గరుడుడినికూడా ఈడ్చుకొని వైకుంఠంనుంచి ఆదరాబాదరాగా వచ్చిన కరుణా మూర్తియైన ఆకారణపురుషుడు ఇన్నాళ్ళైనా రాకపోవటం చూసిన నువ్వు ఇలా ఊరకనే ఉంటావా? కావలసిన వారికి దూరమైతే కలిగేబాధని నువ్వు మరిచిపోయేవే! ఆబాధ ఇప్పుడు నీకు లేకపోయినా, ఇదివరకు కలిగినదాన్ని మరిచిపోలేవే! అలాంటినువ్వు కూసిపిలిస్తే పరమపదనాథుడుకూడా గరుడుడి తోపాటు ఎగిరివచ్చి నిలుచుంటాడు. పిలవవమ్మా అని అంటున్నదన్నమాట.

"కృష్ణుడనే ఒకసాటిలేనిపడవ లభించక"అని అనకుండా "వైకుంఠుడనే ఒకసాటిలేనిపడవ లభించక అని సాయించటంలో భావమేమిటంటే- "పెరుమాళ్ళు ప్రీతితో వేంచేసిన అర్చావతారస్థలాలకివెళ్ళి అనుభవించ బోయేను. అక్కడ కౌగలించుకోవటం, కబుర్లుచెప్పటం, ఇవేవీ జరగకపోవటం వల్ల అలాచేసిన విభవావతారాల్లో మనస్సుపెట్టేను వాటిలోకూడా తీర్థ ప్రసాదాలతో సరిపెట్టటంలో పరమపదనాథుడివరకూ వెళ్ళేను ఆయనైనా, లభిస్తాడేమో అని చూసేను. ఆయనా లభించలేదు" అంటోంది.

పొన్నురైమేని- ఇదిగరుడుడిని చెప్పేమాటకావచ్చుకాని. పుణ్యమూర్తికి

విశేషణంగా చెప్పటమే బాగా స్వారస్యమైనదికావచ్చు. "తన్నోడు కలన్దపోతు పొన్నోలే తికழ்ంకిఅవడివుమ్, తానుమాకనిన్టనిలై; పిరిన్దపోతుమ్ వడివప్పడియే యిరుక్కుమెన్టిరుక్కిఱాళ్. పిరిన్దపోతు అవనిరుక్కుమ్బడి తాన్ అఱియాళే పిరి వాற்றாமైయాలే నొన్దు వివర్ణనాయిరున్దానాకిల్ కుయిలిన్కాలిలే విప్పార్ త్తిరుక్కుమో వారానో ఎన్టిరుక్కిఱాళ్" అన్న పెరియవాచ్చాన్పిళ్ళైవారి వ్యాఖ్యానశ్రీసూక్తి గమనీయం. నేను ఎముకలన్నీ కరిగిపోయి ఉంటే, ఆయన బంగారుమేని గలవాడై ఉంటే పుణ్యమూర్తి అవుతాడా? ఆయన నన్ను మరిచిపోయి వైకుంఠంలో ఉండే నిత్యసూరులతో కలిసి ఆడుతూపాడుతూ తన స్వభావం, శరీరవర్ణం మారకుండా ఉన్నట్లైతే నువ్వేనా పుణ్యమూర్తివి అని నువ్వే అడుగు.

పుణ్ణియనై - "ఆనృశంస్యం పరోధర్మః -" మీరూ, నేనూ మాత్రమే ఉండి పడవనెక్కి హాయిగా అనుభవించవలసి ఉండగా ధర్మాల్లో మీరు కోరేదేమి?" అని నేనడిగితే "నేను ఇతరులు బాధ పడుతూంటే సహించలేను, ఇదే బహుశః సారమైన ధర్మం అని భావిస్తాను." అనిచెప్పేరు. ఇదే మీదాసుడైన ఆంజనేయుడినోటవినటమే కాకుండా మీనోటితో మీరే చెప్పగా నేను విన్నాను. "ఇదే ఇతరులమీదపెట్టి మీరు నన్ను దూరంచేసి బాధించినట్లున్నది" అని చెప్పినావారాయన కావచ్చు. కాని, అలా చెప్పటానికిన్నీ, ఇప్పుడు ఈవిధంగా చెయ్యటానికీ కొంచెంకూడా సరిపోదే అని ఆయనతో చెప్పి నువ్వు ఆయనని పిలువుమా అని అంటోందని భావం. ఇతరులు బాధపడుతూంటే సహించలేనివాడి మనస్సుని మార్చనక్కర లేదుగాని ఆయనిక్కడికి రావటానికి నువ్వువెళ్ళి కాస్త జ్ఞాపకం చేస్తే చాలను కుంటాను "రామో విగ్రహవాన్ ధర్మః అనిన్నీ, "కృష్ణం ధర్మం సనాతనం" అనిచెప్పినట్లు పుణ్యమే రూపుధరించివచ్చినదా అన్నట్టున్నవాడు గనుకనూ, పుణ్యమూర్తియైన అతను రామకృష్ణాద్యవతారాల్లో చూపించిన ఈ రూపాలన్నింటికీ మూలమైన వైకుంఠమూర్తిగా చాలావిశేషమైనవాడు కావాలే! అందుచేత ఆయననే రమ్మని పిలువు అని అంటోంది. 4.

అవతారిక: అయిదవ పాశురం- వైకుంఠనాథుడిని రమ్మని కోకిలతో ఈమె చెప్పేసమయంలో ఈమె పెంచిన చిలుక వటపత్రశాయి తిరునామాన్ని ఈమె దానికి ఎలా నేర్పించిందో చెప్పింది. అది వినటంతో, ఆ స్పృహణీయమైన విగ్రహంగలవాడు ఇక్కడ దగ్గరగా ఉన్నాడే అని భావించి "మరొకచోటనున్న అర్చామూర్తిని, చాలకాలంపూర్వం ఉన్న విభవావతారాలనీ, ఎంతోదూరంలోనున్న వైకుంఠంలో వేంచేసిఉన్నవాడినీ పిలవటమెందుకు, ఇక్కడున్నవాడిదగ్గరనేకదా ఈకోకిలకూతకూడా చేరేది" అని తల్చుకొని ఆస్వామి శ్రీపాదాలనే సేవించాలనే గొప్ప ఆశతో ఈస్వామిని వచ్చేటట్లు తనకూతతో పిలవాలని కోకిలని కోరుతున్నది.

మూ. మెన్నడైయన్నమ్పరన్దువిళైయాడుమ్ విల్లిపుత్తూరుఱైవాన్తన్
పొన్నడికాణ్బతోరాశైయినాలెన్పొరుకయఱ్కణ్ణిణై తుఞ్జా
ఇన్నడిశిలొడుపాలముతూట్టియెడుత్తవెన్కోలక్కిళియై
ఉన్నొడుతోழమైకొళ్ళువన్ కుయిలేయులకళన్దాన్వరక్కూవాయ్

ప్రతిపదార్థం: **కుయిలే**= ఓ కోకిలా! **మెల్ నడై**= మృదువుగా నడచు **అన్నమ్**= హంసలు **పరన్దు**= అంతటను వ్యాపించి **విళైయాడుమ్**= ఆటలాడుకొనుటకు స్థలమైన **విల్లిపుత్తూర్**= శ్రీవిల్లిపుత్తూరిలో **ఉఱైవాన్తన్**= నిత్యవాసంచేస్తున్నటువంటి **పొన్ అడి**= అందమైన, స్పృహణీయమైన శ్రీపాదములను **కాణ్బతు**= సేవించవలెనని **ఓర్ ఆశైయినాల్**= సాటిలేని (మిక్కిలిగానున్న) ఆశచే **ఎన్**= నాయొక్క **పొరు కయల్**= ఒకదానితోనొకటిపోట్లాడుతున్న చేపలవంటి **కణ్ ఇణై**= రెండు కళ్ళున్ను **తుఞ్జా**= మూసుకొనుటయే(నిద్రపోవుటయే) లేదు **ఉలకుఅళన్దాన్**= లోకాలని కొలిచిన త్రివిక్రముడిని **వర**= రావలెనని **కూవాయ్**= పిలువుమా! **ఇన్ అడిశిలొడు**= మధురమైన అన్నమును, **పాల్ అముతు**= అమృతమైన పాలను **ఊట్టి**=తినిపించి **ఎడుత్త**=చేతులపై ఎత్తుకొని పెంచబడిన **ఎన్కోలమ్ కిళియై**= నా అందమైనచిలుకను **ఉన్నొడు**= దానివలెనే నాకిష్టమైన పనిని చేసే నీతో **తోழమై**= స్నేహం **కొళ్ళువన్**= చేయిస్తాను.

వ్యాఖ్యానం: పరమపదంలో నిత్యసూరులకి సేవసాయిస్తూండే సర్వేశ్వరుడు అక్కడ ఉండటాన్ని వదలివేసి, నాతో సజాతీయాలైన హంసల వంటి వాటిని చూస్తూ నావంటి నావంటివాటితో ఊసు లాడుతూ తాను వాటికి సేవసాయిస్తూకాలం వెళ్ళబుచ్చటంకోసమే శ్రీవిల్లిపుత్తూరిలో వేంచేసి యున్నాడు. నానడకవంటి నడకగల హంసలు అంతటా తిరుగుతూ ఆటలాడుకుంటూన్న శ్రీవిల్లిపుత్తూరిలో ఆయన వేంచేసియుండి తనకళ్ళు అందమైన నడకలని చూడాలనే ఆశని ఒకవిధంగా తీర్చుకున్నాడు. తన ఆశని తీర్చుకున్నాడు ఇక, నాకళ్ళ ఆశనికూడా తీర్చాలికదా! ఆయనకళ్ళు నన్ను సాక్షాత్తూ చూడకుండా, నాకు సజాతీయాలైన వస్తువులను చూసినాకూడా నాఆశ తీరేదికదా! నా కళ్ళైతే అలాకాకుండా ఆయనశ్రీపాదకమలాలనే సాక్షాత్తూ సేవించాలని ఆశిస్తూంటే ఆయన నాఆశని నెరవేర్చకపోవటంచేత నాకళ్ళు ఒక్కక్షణంకూడా మూసుకోవటం కుదరటంలేదు. ఇదీ ప్రథమార్థంలో చెప్పబడింది.

ఈసందర్భంగా నంబిళ్ళైగారికీ నంజీయరువారికీ ఒకచర్చ జరిగిందట. "వెనుకటి పాశురంలో 'వైకున్దనెన్బదోర్తోణిపెరాతుఴల్కిన్ఱేన్' అని చెప్పినది, శ్రీవైకుంఠం ఆణ్డాళ్‌కి అందనిప్రదేశంగనుక, ఆవైకుంఠుడిని పొందటానికి సాధ్యంకాక బాధపడటంతగినదే. ఈపాశురంలోనయితే "విల్లిపుత్తూరుఱైవాన్ఱన్ పొన్నడి కాణ్బతోరాశైయినాల్" అని అంటున్నది. ఆవూళ్ళోనే పుట్టి పెరిగిన ఈమెకి ఆస్వామితాలూకు శ్రీపాదాలను సేవించటంలో ఏమికష్టం ఉంటుంది? అదేం యోజనదూరమా లేక రెండుయోజనాలదూరమా? నాలుగడుగులు వేస్తే కోవిలలోకి అనుకున్నప్పుడల్లావెళ్ళి యథేష్టంగా పెరుమాళ్ళకి కైంకర్యం చేయవచ్చునే? అలాంటప్పుడు, శ్రీవిల్లిపుత్తూర్‌స్వామిశ్రీపాదాలని సేవించటం లభించక కళ్ళు ఆర్తితో నిద్రకికూడా నోచుకోలేదని ఈమె సాయించటం ఎలా కుదురుతుంది? వేరేలోకాల్లోనో, వేరుదివ్యదేశాల్లోనో ఉండే పెరుమాళ్ళని ఈమె సేవించలేకపోవటంచేత వైకుంఠనాథుడిని పిలవమని కోకిలని ఆజ్ఞాపిస్తే తగును. నిత్యం తానుఅలంకరించి, దగ్గరగాస్పృశించే వటపత్రశాయిని చూడక పోయి, కళ్ళకి నిద్రలేమిని చెప్పటం, పిలవమని చెప్పటం, తగునా"అని

నంజీయరువారి సన్నిధిలో నంబిళ్ళై విన్నపించేరట. దానికి నంజీయరువారు, ఇలా సమాధానం సాయించేవారట - మీరు అడగటం బాగుంది. ఆండాళ్ శ్రీవిల్లిపుత్తూర్‌లోనే పుట్టి, పెరిగినదే అయినా, వటపత్రశాయిసన్నిధికి వెళ్ళటం ఆమెకి సులువైనది కాదు. మనం అందరం కోవిలకి వెళ్ళివస్తే చిత్తవికారమనేది ఏమీలేకుండా రాతిమనసులతోవెళ్ళి, తిరిగి రాతిమనసులతోనే వస్తాం. స్వామి మీద గురిపెట్టలేం. ఆండాళ్‌ప్రకృతి అటువంటిదికాక, లోపలికి ప్రవేశించటం తోటే, ఆస్వామియొక్క శీలగుణాలని అనుసంధించి, అందులో పూర్తిగా మునిగిపోయి, భరతుడిలాగ బాహ్యస్పృహలేనిదే అవుతుంది. ఇటువంటి ఈమెప్రకృతిని తెలిసిన ఈమెబంధువులు, చెలులు, ఈమెని కోవిలవైపే వెళ్ళ నియ్యకుండా జాగ్రత్తపడుతారు. "కుఱుయుమ్ వాణ్ముకత్తేఱు యైత్తులైవిల్లి మఙ్గలమ్ కొణ్డుపుక్కు ఇఱుకొళ్‌శోదిచ్చెన్దామరైక్కణ్ పిరానిరున్దమై కాట్టినీర్, మఱుపెయ్‌తాలొక్కుమ్‌కణ్ణనీరినొడు అన్తుతొట్టుమ్‌మైయార్‌న్దు ఇవళ్ నుఱు యుమ్ శిన్దైయళ్‌అన్నైమీర్! తొ(ఱుమత్తిశైనోక్కియే" (తి.వా.మొ- 6-5-5) అన్నపాశురం మీకు తెలియనిది కాదుగదా! అందులోసాయించినప్రకారం ఈమెని కోవిల్లోకితీసుకుపోయి పెరుమాళ్ళనిసేవింపచేస్తే, దానివల్ల చిత్త వికారాన్ని కలిగించి 'అన్యాయంగా చంటిపిల్లని కోవిలకి తీసుకొనిపోయి, స్వామివలలో చిక్కుకుపోయేటట్లు చేసేరే'అని నలుగురూ నిందించేలా చేసిన కంటే ఈమెని కోవెలవైపేవెళ్ళకుండా ఉంచటమేక్షేమం అనిభావించి తల్లి దండ్రులు ఈమెని ఇంటిలోనే ఉంచేసే వారు. కనుకనే "విల్లిపుత్తూరుఱైవాన్తన్ పొన్నడి కాణ్బతోరాశైయినాల్ ఎన్‌పొరు కయఱ్‌కణ్ణిఐ తుఞ్జా' అని సాయించి నది చక్కగా కుదురుతుంది" అని సాయించేరట. ఇక్కడ ఓర్ ఆశైయినాల్ అని అనటంవల్ల ఈప్రశ్నకి ఇటువంటిభావనే ఆమెకున్నదని, వేరే ప్రదేశాలమీదున్న ఆశవంటిదికాదీఆశ అనీ,. ఇతరమూర్తులని ఏమాత్రమూ సేవించకపోవటంవల్ల వాటిమీద ఆశఉన్నది. ఈమూర్తినిమాత్రం అన్నిరోజులూ ఈమె సేవించు తున్నప్పటికీ ఈఆశ మిక్కుటమైంది. ఈమె కోవిలలోప్రవేశించి సేవించే సమయంతప్పిస్తే, మిగతా సమయంలో కోకిలతో మాటాడేటప్పుడుకదా, ఆయనని సేవించాలని ఆశ పడుతోంది! ఈమెకోసం కోవెలని ఎప్పుడూతెరిచే

ఉంచుతారా? ''ఆస్థానస్థః సదా సేవ్యః, విమానస్థశ్చ కాలతః స్వగృహే సదా సేవ్యః మధ్య రాత్రంవినా ప్రభుః''అనిచెప్పినట్లు కోవిల్లో సేవించటానికి సమయాలుంటాయి. అదికాక మిగతాసమయాల్లోకూడా ఆయననివదిలి ఉండ టానికి మనస్సొప్పక ఆయనకోసం పరితపించే ఈమెకి వీరి విషయంలో ఉండే ఆశవంటిది మరొకటి ఏమీలేదు. అంతేకాదు, పరమపదనాథుడి శ్రీపాదాలని సేవిచలేకపోయానే అని ఈమె ఇప్పుడు బాధపడటంలేదు. అది ఎంతో దూరంగానున్న దైనందున లభించ లేదని వేచి ఉండవచ్చు. నీళ్ళల్లో ఉన్నచేపకి మరిన్నినీళ్ళుపారేలా చెయ్యటంకంటే దాహంతో ఉన్నవాళ్ళం దరికీ నీటిని అందించటంలాగ, సేవించాలని ఆశించినవాళ్ళందరికీ సేవ సాయించటానికేవచ్చి వేంచేసిఉన్నకోవిల్లో సేవించలేకపోతే పరితాపం మాటలతో చెప్పదగినట్లుంటుందా?

ఈమె ఈవిధంగా పరితాపం తోచేటట్లు చెప్పినది విన కోకిల ఇలా అంటోందట - ''అమ్మా నువ్వు పరితపించిపోవటం నిజమే. దీనికి నేనేం చెయ్యగలను? నిన్ను నేను కోవిలకి పిలుచుకొని వెళ్ళగలనా? నావల్ల చెయ్యటానికి సాధ్య మైనదానిని చెప్పు'' అంటే, ఆపెరుమాళ్ళు ఇక్కడికి వేంచేసేలాగ పిలువు - వరక్కూవాయ్అని అంటోంది. తానున్నచోటికి ఆయన అర్చాసమాధిని వదిలి, అందమైన నడకతో వేంచేసి, తనతో సంశ్లేషించి ఊసు లాడాలని గొప్పఆశతో ఉన్నదీమె. దానికి కోకిల సమాధానం - అమ్మా నువ్వు ఇట్లా ఆశించవచ్చా? ఆస్వామి ఇక్కడికి వేంచేయటమంటే, అదేం సామాన్య మైనదా? ''పెణ్ణులాఙ్ఞడైయినానుమ్ పిరమనుమ్ ఉన్నైక్కాణ్బాన్, ఎణ్ణిలా వూழிయూழி త్తవఞ్జెయ్దార్ వెళ్గినిర్పయే'' అనినీ, ''సమాహితైస్సాధు సనన్ద నాదిభి స్సుదుర్లభమ్'' అని వరదరాజస్తవంలోనూ సాయించినవిషయం నీకు తెలియనిది కాదే! మహామహాతపశ్శాలులందరూ ఆయన వేంచేయటాన్ని కోరుకొని అది లభించక, కలతచెందినవారైనారే! అలాంటిది నీదగ్గరకి ఆయన వస్తాడా?'' అని అన్నది. దానికి ఆమె - ''ఉలకళన్దాన్ వరక్కూవాయ్'' అన్నది. వసిష్ఠచండాలవిభాగమే లేకుండా, గుణాగుణనిరూపణం చెయ్యకుండా, అందరున్నప్రదేశాలకీ సంకోచంలేకుండా వెళ్ళినవాడు ఆయన. లోకాలని

కొలిచినవాడు కదా! తపస్సుచేసినవారు ఖిన్నులైనా, ఊర్ధ్వలోకాల్లోని వాళ్ళం దరూ ఆశ్చర్యపడేలాగ గజేంద్రుడిని కటాక్షించినవాడుగదా! అందుచేత తప్ప కుండావస్తాడు. నువ్వు కూయాలి'' అన్నది. ''మరో మరోఊళ్ళకి వెళ్ళాలంటే నీకుసాధ్యం కాదు, ఇక్కడున్నకోవిలకి నువ్వువెళ్ళి సేవించవచ్చుగదా'' అని వెయ్యబోయే ప్రశ్నకి ముందుగానే సమాధానం సాయిస్తోంది. ''ఇది మెల్లగా రాజహంసలు తిరుగాడే శ్రీవిల్లిపుత్తూర్. ఆ హంసలు ఆ నడకలని నావద్ద నేర్చుకున్నవే అనితెలిసేటట్లు చాలామెల్లగానడిచే నేను ఎప్పుడు ఆయనని వెళ్ళి సేవించగలను? వాటిలాగ నేను అంతటికీవెళ్ళి ఆయనని వెతికే స్థితిలో లేను. శయ్యమీద పడుక్కొనవలసినట్లున్నాను. క్షణకాలంకూడా ఆయనని వదలకుండా ఉండాలని కోరుకొనే నన్ను ఆయనే వచ్చి చేరాలి. ఆయన ఇట్లా మెల్లగా నడిచేవాడు కాడుగదా! లోకాలన్నింటినీ కొలిచినవాడు గదా! చేతిలో నీళ్ళుపడిన తక్షణమే దేవలోకాన్నంతటినీ దాటివెళ్ళేయికదా ఆయనపాదాలు!

ఉలగళన్దాన్ - ఒక్కళ్ళనికూడా వదలకుండా అందరినీ తన శ్రీపాదంతో స్పృశించి అనుగ్రహించినవాడున్నూ, దేవతలకీ, రాక్షసులకీకూడా ఇష్టమైన వాడును అయిన ఆయన స్పృహణీయమైన శ్రీపాదాలు నన్ను తాకకపోవటం న్యాయమా? అని అంటున్నదన్నమాట'' అని ఇక్కడ ఈమె సాయించింది.

పొన్నడి - అన్నందువల్ల వెనుకటి పాశురంలో చెప్పిన బంగారు విగ్రహంగల పుణ్యమూర్తి అని చెప్పబడిన వైకుంఠనాథుడున్నూ ఈయనా ఒక్కడే అని తేలింది.

పొరుకయల్కణ్- రెండుకళ్ళూ పోటీపడి నిద్రపోకుండా ఉన్నట్టున్నాయి ముక్కుకి రెండుపక్కలా రెండుకళ్ళుండటాన్ని చూస్తే ఒకచేపతో మరొకచేప ఎదురుగా యుద్ధంచేస్తున్నదా అనిపిస్తుంది. అటువంటి నేత్రాలనుచూసి కన్నార్పకుండా రెప్పవెయ్యకుండా ఆ భగవానుడు ఉండవలసినది కాని ఈమె ఆబాధపడుతోందంటారు పెరియవాచ్చాన్పిళ్ళై

కణ్ణిణై తుఞ్జా - ''వైకుంఠుడిని తలుచుకొనగానే నీకనురెప్పలు మూసు కొనటమనేది లేకుండా ఉన్నాయి. అలాంటప్పుడు వైకుంఠుడిని పిలవాలిగాని విల్లిపుత్తూరులో వేంచేసియున్న స్వామిని పిలిచి ఏమి ప్రయోజనం?'' అని

అనుకోవద్దు. ఆ పరమపదనాథుడే నాలాంటివాళ్ళననుగ్రహించటానికని ఈ వటపత్రశాయిగా వేంచేసేడు. ఈయనని గురించి తలుచుకొనగానే ఇక నాకన్నులు మూసుకొనటమనేదేలేదు. .

“కోకిలా! మనస్సు కరిగిపోయేలా కూసినందుకు ప్రయోజనమే లేదంటావా? ప్రయోజనం కల్పిస్తున్నాను - పొందుదువుగాని” అని ఇన్నడిశిలొడు అనే ప్రయోగంతో చెప్పింది. గుహుడు రామచంద్రుడికి చేసిన గొప్ప సహాయానికి ఆయన గుహుడికి లక్ష్మణస్వామితో స్నేహమే ప్రత్యుపకారంగా చేసేరు అనిప్రసిద్ధమేగదా! “తస్మై సౌమిత్రిమైత్రీమయముపకృతవాన్ ఆదరం నావికాయ” అన్నాడు మురారికూడా. అదేవిధంగా ఆండాళ్‌కూడా తానెంతో ప్రేమతో మధురమైన పాలన్నం తినిపించి పెంచిన తన పెంపుడు చిలుక నీతో స్నేహం చేస్తుంది అని ప్రత్యుపకారాన్ని చెప్తోంది. ఈ సందర్భంలో ఆండాళ్ భగవానుడిని చేరటానికి కోకిలని సహాయం కోరుతున్నది అంటే మధురమైన వాక్కుగల, ఆచార్యుడిని సహాయం చెయ్యమని కోరుతున్నదని మనం అర్థం చేసుకోవాలంటారు పెరియవాచ్చాన్పిళ్ళై. దానికోసం తనదని చెప్పగలిగిన చిలుకను కోకిలతో స్నేహం చేయిస్తానంలోంది. అంటే, తాను భగవానుడిని చేరితే, తాను, ‘మమ’అనుకొనే వాటినీ, అన్నింటినీ ఆచార్యుడికే సమర్పిస్తుం దన్నమాటంటారు వారు.

ఇన్నడిశిలొడు పాలముదూట్టి అని అన్న దానికి అన్నం, పాలు కలిపి ఇయ్యటం అని అర్థం. అడిశిల్(అన్నం) తక్కువగాను పాలు ఎక్కువగాను ఉండటంచేత పాలొడు అడిశిల్ అని అనకుండా అడిశిలొడుపాల్ అని అన్నది. ఇటువంటి ప్రయోగాల్లో ఓడు అనేవికృతికి ప్రకృతియైన పదానికే ప్రాధాన్యతని తమిళులు భావించటం ఉన్నది. అడిశిల్ అనేపదానికి మధురమైన, మేలురకం బియ్యంతో చేసినది అని అర్థం అయినా, చక్కగా రుచిగా వండినది అని చెప్పవచ్చును. అముదు అనటం- అడిశిల్ సహజంగానే మధురమైనది, పాలు కూడా దానికి తగినట్లు అమృతంవంటి అతిమధురమైనవి అనిఅర్థంచెప్తున్నది. లేదా, పెరుమాళ్ళు తమ దృష్టివిశేషంచేత కటాక్షించినదిగనుక అది అమృతమైనదని చెప్పబడినదికావచ్చును. ఇక, చిలుకకు తినిపించేనని

చెప్పటంలో విశిష్టులైన భాగవతులకి తదీయారాధనంచేస్తున్న భావంలో దానికి పాలన్నం తినిపించేను అని చెప్పినట్లును కావచ్చును. ఇక్కడ "ఇన్నడిశిల్ అంటే చెరుకు,పాయసం; పాలముతు అంటే పాలు అన్నం కలిపినది" అని రెండు విడివిడి భోజనపదార్థాలని చెప్పడంకూడా ఉన్నది. కిళియై త్తోழமై అనిచెప్పటంవల్ల చిలుక వడపెరుంకోయిలుడైయానుని పిలిచి నన్ను సంతోష పెట్టినట్లు నువ్వుకూడాచేస్తే నీమీదకూడా అంతప్రేమతో మధురమైన అడిశిల్ తోపాటు పాలన్నాన్నితినిపించటానికి తయారౌతాననిచెప్పినట్లు. కొళ్వేప్పన్ -స్నేహం చేయిస్తాను- అని అనకుండా కొళ్ళువన్- చేస్తుంది అని చెప్పటంలో అది స్నేహంచెయ్యటమనేది నీతో స్నేహంచెయ్యటమే ఔతుందని, ఇతరులె వరితోనూకాదని చెప్పటమంటారు ఉత్తమూర్స్వామి. కూవాయ్ అనిచెప్పటం ఇంతటితో పూర్తయిందనిచెప్పటం. అందుచేత ఇక వటపత్రశాయినిపిలవ వలసిన కోకిలని లేతకోకిలా, చిన్నకోకిలా అన్నట్టు పిలిచి చెప్తున్నదన్నమాట.5.

అవతారిక: (ఆరవ పాశురం) కోకిల తోటలో నిద్రపోవటం చూసింది ఇది ఇక్కడ విరిసిన చిగుళ్ళలోని తేనెని త్రాగి మత్తెక్కి కళ్ళుమూసుకొనే ఉన్నది. ఇదెలా ఉందంటే, మధురమైన అడిశిలైనా, పాలన్న మైనా నాకేమిటని కోకిల అంటున్నట్టున్నది. ప్రతీరోజూ నీస్థితిని కోవిల్లో ఉంటూ ఆయనకి చూపించి వచ్చేటప్పుడు ఆయనే నీదగ్గరకి రాలేడా? నీమీద మనస్సులేక నీకు నిజమైన నాయకుడు కానివాడిని పిలవటానికి ప్రయత్నించటంవల్ల ఏంప్రయోజనమని అనుకుంటున్నావని కోకిల అడుగుతున్నదని భావించి ఈపాశురంలో దానికి సమాధానం చెప్తోంది.

*మూ. ఎత్తిశైయు మమరర్పణిన్దేత్తుమిరుడీకేశన్వలిశెయ్య*
*ముత్తన్నవెణ్ముఱువచ్చెయ్యవాయుములైయుమళగళిన్దేన్నాన్*
*కొత్తలర్కావిల్మణిత్తడజ్ఞణ్పడైకొళ్ళుమిళఙ్గుయిలేయెన్*
*తత్తువనైవరక్కూకిற్றియాకిల్ తలైయల్లాల్ కైమ్మాఱిలేనే. 6*

ప్రతిపదార్థం: **కొత్తు**= గుత్తులుగుత్తులుగా **అలర్**= వికసిస్తున్న **కావిల్**= తోటలో

***మణి***= అందమైన ***తడమ్***= విశాలమైన స్థలంలో ***కణ్పడై***= నిద్రను ***కొళ్ళుమ్***= స్వీకరించే ***ఇళ కుయిలే***= లేతవయసులోనున్న ఓ కోకిలా! (లేతవయసులో ***ఎత్తిశైయుమ్***= అన్నిదిక్కులలోను ***అమరర్***= దేవతలచే ***పణిన్దు***= నమస్కరించబడి ***ఏత్తుమ్***= స్తోత్రము చేయబడే ***ఇరుడీకేశన్***= హృషీకేశుడు ***వలిశెయ్య***= వంచించటంచేత ***నాన్***= నేను,***ముత్తు అన్న***= ముత్యాలవంటి ***వెణ్***= తెల్లని***ముఱువల్***= పలు వరుసగలదియు ***శెయ్య***= ఎర్రని ***వాయుమ్***= అధరములు గలదియు ***ములైయుమ్*** = స్తనములుగలదియు ***అழ்ழకు***= అగు నాసౌందర్యమును ***అழ்ழిన్దేన్*** = పోగొట్టుకొన్నాను ***ఎన్ తత్తువనై***= నాస్వామిని ***వర***= వచ్చేటట్లు ***కూవ్కిఱ్ఱి***= కూయగలది ***ఆకిల్***= అయితే ***తలై అల్లాల్***= తలవంచి నమస్కరించటం కంటే గొప్ప దైనదాన్ని మరొకదానిని ***కైమ్మాఱు***= ప్రత్యుపకారము ***ఇలేన్***= లేనిదానను.

వ్యాఖ్యానం: ఎక్కడచూసినా దురభిమానులైన బ్రహ్మాదిదేవతలు తమతమ అభిమానాలనివదలి స్వామిశ్రీపాదాలమీదపడి నమస్కరిస్తూంటారు. ఏదిక్కుని చూసినా, ఒక్కొక్కదిక్కుకీ నిర్వాహకులైన ఇంద్రుడు, వరుణుడు, కుబేరుడు మొదలైన దేవతలు గుండెలమీద చెయ్యివేసి "నాకంటె గొప్ప దైవం లేదు, నాకంటె గొప్పవాళ్ళెవళ్ళూ లే"రని చెప్పుకుంటారు. వాళ్ళు పెరుమాళ్ళని చూడగానే "జయము జయము, మంగళమగుగాక, జితంతే" అని నమస్కరించి స్తుతిస్తారు. అటువంటి దురభిమానిదేవతలు అహంకారాన్ని వదలివేసి నమస్కరించటానికి కారణమేమిటంటే, ఈయన హృషీకేశుడుగదా! "ఇంద్రియాణాం నియన్తృత్వాత్ హృషీకేశః ప్రకీర్తితః" అని నిరుక్తం చెప్తోంది. అందరి ఇంద్రియాలనీ నియమిస్తూ పాలించేవాడు ఈయనగనుక వాళ్ళ దురభిమానాన్ని పోగొట్టి వాళ్ళచేత స్తుతించబడుతూంటాడు. అట్లా ఆయన అందరికీ సమాశ్రయణీయుడైఉండి తననినాకు చూపకుండా బాధపెడుతుండటంవల్ల ముత్యాలవంటి నాపలువరసా, నాచిరునవ్వూ, శోభపోగొట్టుకొనిన అధరమూ, అందంపోయిన స్తనాలు, విశిష్టతని పోగొట్టుకొన్నాను అంటున్నది ముందరి పాదాల్లో.

లోకాలని కొలిచినప్పుడూ, ఇంకా ఇతరసమయాల్లోనూ అన్ని

దిక్కుల్లోనున్న దేవతలు ఆయనని చూసి తలలువంచి నమస్కరిస్తూ, స్తుతిస్తూ, నిత్యసూరులు అన్నివేళల్లోనూ అంతటా బాగా స్తుతించేటట్లున్నూ ఉన్న హృషీకేశుడిని తప్పకుండా పొందగలననే నమ్మకంవల్ల నా పలు వరుస, అధరములు, స్తనములు ఇవన్నీ ఆనందంతో ఒక మంచి శోభనీ, అందాన్నీ పొందిఉండేవి. అటువంటి ఆ హృషీకేశుడు నా కళ్ళకి తాను కనబడకుండా నామనస్సులో ప్రవేశించి అక్కడనుండి మరి కదలకుండా ఉండి ఆయనని సేవించాలనే నా కోరికని ఉద్ధృతమైనదిగా చేసి, అనుభవించటానికి అవకాశంలేకుండా చేసి, నన్ను వంచించేడు. అందువల్ల నా అవయవాల అందాన్నంతటినీ పోగొట్టుకున్నాను. “కాఱై పూణుమ్ కణ్ణాడి కాణుమ్ తన్ కైయిల్ వళై కులుక్కుమ్ కూఱైయుడుక్కుమ్ అయర్క్కుమ్ తన్ కొవ్వై చ్చెవ్వాయ్ తిరుత్తుమ్” అని పెరియావారు 3-7-8లో సాయించినవిధంగా నాదంతములు, అధరములు ఉన్నస్థితిని నేనే అద్దంలో చూసుకున్నాను. నామీద ఆయనకు ప్రేమ లేకపోతే, హృషీకేశుడైన ఆయన నామనస్సుకీ, ఇతరావయవాలకీ ఈదశని ఇవ్వలేడే! అందుచేత నాస్వామియే ఆయన. కాని నన్ను వదలి పోయినాడు. అందుచేత నువ్వు ఆయన వచ్చేటట్లు కూతపెట్టు. నీకివ్వటానికి నాదగ్గర ఏమీ లేదు. తినటానికీ, నిద్రించటానికీ నీకు మంచి హాయైన స్థితి ఉన్నది. గుత్తులుగుత్తులుగా పూచిన పువ్వులతోటలో ఉన్నావు. పడుక్కొనటానికి మణిమయమైన తల్పమున్నది. అందుచేత నీకు ప్రత్యుపకారం చేద్దామంటే ఏదీ ఇవ్వతగిన వస్తువే కనబడలేదు. అందుచేత ఎప్పటికీ నీకు తలవంచి నమస్కరించటమే చెయ్యగలను. నీకు మరొకటి ఏదైనా చెయ్యటానికి ఉన్నప్పటికీ, అది నీకు ప్రత్యుపకారంకానేరదు. ఓ లేత కోకిలా! నువ్వు ఇంకా చిన్నవయసులోనే ఉన్నావుగనుక, యవ్వనంలో ఉన్నవాళ్ళస్థితి నీకు తెలుసునుగదా!

ఇరుడీకేశన్ వలి శెయ్‌తల్ - నా ఇంద్రియాలన్నింటినీ కొల్లగొట్టి నన్ను నీరసింపజేసి, ఇప్పుడు తన సౌశీల్యగుణాన్ని దాచిపెట్టి శత్రువులకి చూపవలసిన కష్టాలని నాకు చూపుతున్నాడు. ముఋవల్ అంటే దంతాలకీ, చిరునగవుకీ పేరు.

"నన్ను బాధించటానికి తనబ్రతుకును కూడా పాడుచేసుకోవటానికి సిద్ధపడ్డాడు.- కదా ను చారు బింబోష్ఠం తస్యాః పద్మమివాననమ్। ఈషదున్నమ్య పాస్యామి రసాయనమివోత్తమమ్" అనికదా ఆయన అన్నాడు అంటున్నది ఈమె" అన్న వ్యాఖ్యానశ్రీసూక్తి అందం చూడండి. ఆండాళ్ తాలూకు చిరునగవూ, ఎర్రని అధరం, స్తనమూ ఆయనకి ఆనందం కలిగించేవి గనుక, తనజీవనాన్నే చెడగొట్టుకొనే తనబాధని చూపించేవాళ్ళు లోకంలో ఉంటారా? ఒక కోపావేశంలో మంచినీళ్ళకుండని తన్నివేసి, ముక్కలుచేస్తే, తరువాత దాహం వేస్తే వాడే కదా బాధపడాలి! అలాగనే ఇప్పుడు ఏదో కోపంకొద్దీ ఆస్వామి తనకి జీవనమైన నా అవయవాలని పాడుచేస్తే, రేపే "ఈషతున్నమ్య పాస్యామి" అని చెప్పి పరుగుపెట్టి వస్తాడే, అప్పుడు నిరాశచెందుతాడుకదా అంటున్నట్టున్నది. ఇట్లా సర్వేశ్వరుడి సంపద నశించిపోబోతూంటే ఓ కోకిలా! నువ్వు హాయిగా నిద్రపోతున్నావా? నీ ధైర్యాన్ని నేనేమనాలి? అంటున్నది "కొత్తలర్కావిల్" ఇత్యాదివాక్యంలో. కణ్పాడు, కణ్పడుతల్, కణ్పడై ఈ పదాలన్నీ నిద్రకి పర్యాయపదాలే.

ఎన్తత్తువన్ అన్నదానికి నాయొక్క సత్తకు హేతువైనవాడు అని అర్థం చెప్పబడింది. తత్త్వం అంటే స్వరూపమై, స్వరూపం అంటే ఆత్మ యై, ఆత్మ అయినవాడు సత్తాహేతుభూతుడుగనుక, ఆవిధంగా సాయించబడినది. ఈ కోకిల కూసి పిలవాలని ఆయన రావటానికి ఆలస్యంచేసినా, తనసత్త ఆయనే అని భావిస్తున్నది అని వ్యాఖ్యాన శ్రీసూక్తి. ఇక్కడ నంజీయరువారికీ, నంబిళ్ళై గారికీ మధ్యని జరిగిన ఒక సంవాదాన్ని పెద్దలు చెప్తారు. అదేమిటనగా - మాయావియైన రావణుడు 'రాముడు తలనరుకబడి, నశించేడు' అనితోచేటట్లు ఒక మాయాశిరస్సుని తీసుకువచ్చి సీతాపిరాట్టికి చూపించి, "ఓ సీతా ఇదిగో చూడు, నీ భర్త తలనరకబడి నశించేడు" అని చెప్పినప్పుడు ఈకాలపుస్త్రీలు తమభర్తల మరణానికి వెంటనేకన్నీరు కార్చటంలాగ ఆమెకూడా దుఃఖపడి నట్లుగా కాస్తంతదుఃఖపడి ప్రాణాలతోఉన్నదేతప్ప ప్రాణేశ్వరుడు పడిపోయినా డని ఆమె పడిపోలేదే! నిజమైన ప్రేమ ఉండిఉంటే ఆసమయంలోకూడా ఆమె ప్రాణాలుపోకుండా ఉంటుందా? ప్రాణనాథుడు ప్రాణాలని వదిలేడని మాయా

శిరస్సుని చూసి, నమ్మిన తరువాత కూడా ఆమె బ్రతికే ఉన్నది. ఎంతోసేపు విలపిస్తూనే ఉన్నదని శ్రీరామాయణంలో చెప్పబడియున్నదే, ఆమెరాముడి మీదచూపిన ప్రణయానికీ, ఇప్పుడిలా ఉండడానికీ నప్పటమేలేదే'' అని నంజీయరువారి సన్నిధిలో నంబిళ్ళైగారు విన్నపించగా, దానికి నంజీయరు వారుసాయించిన సమాధానమేమిటంటే- అయ్యయ్యో! మీరడిగినది బాగుంది! నాయకుడు ప్రాణాలతోనే ఉన్నాడని భావించినట్లైతే ఉత్తమనాయకి ప్రాణాలతో నిలిచే ఉంటుందనీ, నాయకుడు మరణించేడని భావించినట్లైతే ఆమె ప్రాణాలు వదలాలనీ మీరనుకుంటున్నట్లున్నది. నాయకి ప్రాణాలతోఉండటానికీ, ప్రాణాలుపోవటానికీ నాయకుడి బతికేఉన్నాడని, మరణించేడనీ తెలుసు కొనటంకారణంకాదు. దేశాంతరంవెళ్ళిన నాయకుడు దారిమధ్యన చనిపోయి నట్లైతే ఈవిషయం ఊళ్ళోఉన్న ప్రాణసఖి తెలుసుకొనటం సాధ్యం కాదుగదా! అందుచేత తన ప్రాణనాథుడు జీవించే ఉన్నాడు అని భ్రమించినప్పుడు ఆమె సుఖంగా జీవించటం, దేశాంతరంలో నాయకుడు సౌఖ్యంగా బ్రతికున్నప్పటికీ, అతనుమరణించేడని అబద్ధంచెప్పేవాళ్ళమాటనినమ్మి ప్రాణాలువదలటం ఉత్తమనాయకి చేస్తుందని అనుకోకండి. నాయకుడు దేశాంతరంలోఉన్నా, నిజంగా అతను బతికేఉంటే, అదే కారణంగా నాయకిప్రాణాలు ఉంటాయి. మరణించేడని ఇతరులు అబద్ధాలు చెప్పినా, ఆమాట చెవిలో పడేటప్పుడు ఏదోకొంచెం బాధకలుగుతుందేతప్ప, నిజంగా నాయకుడి సత్తకి లోటులేక పోవటంవల్ల "ఆఖ్యాతి హృదయం హృదా- అతని మనస్సు, ఈమె మనస్సు ఒకదానితో ఒకటి చెప్పుకుంటాయి'' అని చెప్పినట్లుగా మనసుకి మనస్సే సాక్షిగా వాస్తవమైనవిషయం మనస్సులో తెలుస్తుందిగనుక, ఇతరులు అబద్ధం చెప్తే అది పనిచెయ్యదు. ప్రాణనాయకుడు సముద్రంఅవతల దీవిలో ఉన్నప్పటికీ, అతను ఏక్షణంలో ప్రాణాలువదులుతాడో, ఆక్షణంలోనే నాయకి ప్రాణాలు కూడా వాటివెనుకనే వదిలిపోతాయి. నాయకుడు మరణించేడని ఎవళ్ళూ చెప్పనక్కరలేదు. పైవాళ్ళు చెప్పకపోయినా, లేక నీ నాయకుడు సుఖంగాఉన్నాడని ఎంతనమ్మకంగాచెప్పినా, ఈమెప్రాణాలు క్షణకాలంకూడా నిలవవు. దంపతులిద్దరిమనస్సులకీ ఒక విలక్షణమైన సంబంధం ఉండటంవల్ల

ఆ సంబంధమే నాయకికి ఆక్షణంలోనే హఠాత్తుగా నశించిపోతుంది ఇలాగనే నాయకివిషయంలో నాయకుడు ఏలోటూలేకుండా బ్రతుకుతున్నప్పటికీ, దానికి వ్యతిరేకంగా ఎవరేదిచెప్పినా, ఎంతమాయచేసి చూపించినా, వెనక చెప్పిన మనోసంబంధం యథార్థాన్ని మనస్సుకి అందుబాటులోకి తీసుకు రావటంవల్ల ప్రాణాలు పోకుండా, బ్రతికే ఉంటుంది. గొప్పదైన, నిజమైన ప్రేమ గలిగిన నాయకీనాయకుల పద్ధతి ఇటువంటిదే అవుతుంది. సీతాపిరాట్టి కూడా అటువంటిఉత్తమనాయకిగనుక, రావణుడు మాయాశిరస్సుని చూపించి, ఎంతవంచించినా, నిజానికి రామచంద్రుడి సత్తకి హానిలేదుగనుక, ఆరాక్షసుల మాయాకృత్యాలు ప్రయోజనం లేనివే అయి, ఆయన మనస్సాక్ష్యమే నిలిచి ఆమెని ప్రాణాలతోఉంచింది. అందుచేత పిరాట్టియొక్క సత్తకి పెరుమాళ్ళసత్తే కారణం అని తెలుసుకొనండి'' అని సమాధానం ఇచ్చేరు. తిరువాయ్మొழி (3-1-10)లో ''ఏఴు శేవకనార్క్కు ఎన్నైయుముళళెన్మిన్గళ్'' అన్నపదాలకి ఎంబెరుమానారులు అర్థాన్ని సాయిస్తున్నప్పుడు ఈఅర్థాన్ని వివరించేరని ఈడులో ఉన్నది. ఈసంవాదం ''ఎన్‌తత్తువనై'' అన్న ఈసందర్భానికి తగిన వివరణంగా ఉదాహరించబడింది. దానికీ, దీనికీ ఏమిసంబంధం అంటే, వినండి - కోకిల ఆండాళ్‌ని చూసి, ''స్త్రీరత్నమా! హృషీకేశుడిని వచ్చేటట్లు పిలవమని నువ్వు చెప్తున్నావు, ఆయన నీతో కలసిఉన్నప్పుడు ''నిన్నువదిలి వెళ్ళను, వెళితే బ్రతకను( అంటే, ప్రాణాలతో ఉండలేను) అని చెప్పటం నేను విన్నాను, నీకుకూడా అదిజ్ఞాపకముండే ఉండాలి, అందుచేత నిన్ను వదిలి వెళ్ళిపోయి, ఇంకా రాకుండాఉన్న ఆయన బ్రతికే ఉన్నాడని నాకనిపించటం లేదు ఆయన నీమీదిఆశతో కాలంచేసిఉంటాడని అనుకుంటున్నాను. అందు చేత నేను పిలవటం వ్యర్థమే అవుతుంది. నన్ను అనవసరంగా కష్టపెట్టకు'' అని చెప్పింది. అదివిన్న ఆండాళ్ ''అయ్యో తెలివిమాలినదానా! అలాకాదే! నేను సత్తపోకుండా ఉన్నానుగనుక, ఆయనకూడా సత్తతో ఉన్నాడనేనిశ్చయం. ఆయన సత్తకి హాని కలిగియుండిఉంటే, ఆక్షణంలోనే నాసత్తకూడా నశించిపోవునే! ఆయన నాతత్త్వమేకదా! అందుచేత ఆయన సత్త ఏమీ చెడకుండానే ఉన్నది అని చెప్తోంది.

వలి శెయ్‌తల్ - బలవంతం చెయ్యటంకావచ్చు, వంచన చెయ్యటం కావచ్చు. ముఱువల్ అన్నది ఇక్కడ నోరు, స్తనం అనే పదాలతో కలిపి చెప్పటంవల్ల దానికి తగినట్లుగా ఒక అవయవాన్ని చెప్పడంవల్ల దంతము అని అర్థం వస్తుంది. చిరునగవు అనే అర్థం కూడా దీనికి ఉన్నది. మణిత్తడమ్ కణ్‌పడై - పడై అని నిద్రావాచకం ఉన్నందువలన కణ్ అనే పదానికి సప్తమీవిభక్తివచ్చి తడమ్‌కణ్ - తటమందు అని చెప్పవచ్చును అయినప్పటికీ, "కణ్‌పడైకొళ్ళిల్ కడల్‌వణ్ణన్ కైత్తలత్తే" అని ఉన్న ప్రయోగానికి తగినట్లుగా ఇక్కడ కణ్‌పడై అనే పదం ప్రయోగించబడింది. తత్తువనావాన్ అంటే అధికారి, రాజు, దేముడు, విష్ణువు. తత్త్వం అన్నపదానికి వస్తువుయొక్క స్వభావం అని అర్థంగనుక, ఎన్ తత్తువన్ అన్నదానికి నా స్వభావంఉన్నవాడు అని అర్థం కూడా వస్తుంది. లోకంలో ఉన్న వస్తువులన్నింటిస్వభావాలకీ పరమాత్మే ఆధారమైనవాడు. "స్థూలత్వం యాతి చేశః ప్రకృతితనుః" అని శ్రీవేదాంత దేశికులు సాయించేరు. అందుచేత అంతర్యామిగానున్నవాడని సూచిస్తున్నది. కనుక నా సత్తకి ఆయనే కారణం అనిన్నీ, ఆయనకొఱకే నా ఉనికి అనిన్నీ భావం వస్తుంది. లోకంలో స్త్రీ, పురుషుడుఅంటూ తేడా లేకుండా ఆత్మ ఒకటే అని శాస్త్రాలు చెప్పుతున్నందున, స్త్రీపురుషుల మనస్సు ఒకే స్థితిలో ఉంటుందికనుక తనవలెనే ఆయన ఉన్నాడని తెలియచెయ్యటమూ ఎన్‌తత్తువన్ అని తన ప్రియుడిని చెప్పుతున్నదన్నమాట.

కూకిఱ్ఱి- కూవు అనే క్రియాపదంలో ఒకఅక్షరం ఛందస్సుగణానికి సరి పోవటానికి వదలివేయబడింది. కూవ్‌కిఱ్ఱి అనికూడా ఉంటుంది. కిఱ్ఱి అన్నది కిల్ అనే క్రియాపదప్రత్యయంవంటిదై భూతకాలాన్ని చెప్పేది. అంటే కూసియుండియున్నట్లైతే అని అర్థం అన్నమాట.

తలైయల్లాల్ కైమ్మాఱిలేన్ - అంటే నువ్వు ఎంబెరుమానుడిని రమ్మని పిలిచినట్లైతే, దానికంటే గొప్పదైన మహోపకారం మరేమీ లేదుగనుక, దానికి తగిన ప్రత్యుపకారం నావల్ల చెయ్యగలిగినది లేదు. నేను బ్రతికి ఉన్నన్నాళ్ళూ నీకాళ్ళమీద నాతలనిపెట్టటమే నేనుచెయ్యదగిన ప్రత్యుపకారమని అంటున్న దన్నమాట.

తలైయల్లాల్ అన్నదానికి తలవంచి నమస్కరించటం తప్ప అని అర్థం సుఖంగా తెలిసేదే. ఎలాగంటే - శిరస్సే ప్రత్యుపకారం కాదుగనుక, శిరస్సుతో చేసే పని ప్రత్యుపకారం అని సులభంగా తెలుస్తుంది. తలతో చేసేది అంటే అది తలనువంచి నమస్కరించటమనే అవుతుంది. "తాః సర్వాః శిరసా దేవః ప్రతిగృహ్ణాతి వై స్వయమ్" అని పరమైకాంతుల చేష్టలను పరమాత్మ శిరస్సుతోనే ప్రతిగ్రహిస్తాడు అంటే తలాడించి పొందుతాడు అని అర్థం వస్తోందికదా! "శిరసా యాచితో మయా" అంటే తలతో యాచించబడ్డాడని అర్థం కదా అంటే తలతో నమస్కరించి యాచించబడినాడు అని స్పష్టమే గదా!

నఞ్జీయర్‌వారిని ఆశ్రయించి దివ్యప్రబంధాల్లోని విశేషాలను తెలుసుకొన్న వారిలో పెఱ్ఱిఅని ఒకస్వామి ఉండేవారు. వారు తిరువాయ్ మొழ்ழி విశేషార్థాలని ఎన్నోసారులు సేవించినా, నాచ్చియార్ తిరుమొழ்ழிని మాత్రం సేవించే అవకాశం పొందలేదు. ఆస్వామి ఒకసారి సేతువుయాత్రకి తూర్పుకి వెళ్ళేరు. అప్పుడు కొందరాస్తికులు వారివద్దకివచ్చి "స్వామీ, "తలై యల్లాల్ కైమ్మాఱిలేనే" అన్నదానికి భావం తెలియటంలేదు, దేవరవారు సాయించవలెను" అని కోరేరు. కోకిలా, ఎంబెరుమానుడు ఇక్కడికి వచ్చేటట్లు నువ్వు కూయగలిగితే, దానికి ప్రత్యుపకారంగా నా తలని (నరికి) నీకు ఇస్తాను అని అంటోంది అన్న అర్థం చెప్పి తరువాత నంజీయరువారి భావన ఏమిటి అని తెలుసుకొనాలి అని ఆశించేరు. యాత్రపూర్తైనతరువాత శ్రీరంగానికి తిరిగి వచ్చినతరువాత నంబిళ్ళగారిని కలిసినప్పుడు "స్వామీ, దాసుడు జీయర్‌వారిసన్నిధిలో పదకొండుసార్లు తిరువాయ్‌మొழ்ழிకి అర్థాలని విన్నాడు, నాచ్చియార్‌తిరుమొని వినే అదృష్టం పొందలేదు, 'తలైయల్లాల్ కైమ్మాఱిలేనే' అన్నదానికి జీయర్ ఏవిధంగా వివరణం సాయించేరు?" అని ప్రశ్నించేరట. "నువ్వు చేసిన ఉపకారానికి ఈదాసురాలిచేత చెయ్యగలిగినది ఏదైనా ఉన్నదా అని నా శిరస్సుని నీకే శేషముగా చేసి మిగిలినకాలమంతాకూడా నీకాళ్ళకి మ్రొక్కటమే చేస్తూంటాను అని అన్నదని జీయరువారు సాయించేరని నంబిళ్ళైగారు సాయించగావిని పెఱ్ఱిగారు దానికి చాలా

ప్రశంసించి, ''స్వామీ, దాసుడికి తరచుగా యాత్రలకి వెళ్ళటం తటస్థించటంవల్ల స్వామిసన్నిధిలో విఘ్నంలేకుండా వారిని సేవిస్తూ వారు కటాక్షించినవిశేషార్థాలని వినే భాగ్యం లేక ఎన్నో విశేషార్థాలని పోగొట్టు కొన్నాను సరైన అర్థాన్నితెలుసుకొన్నారని ఒక ఐతిహ్యం చెప్తారు. తలనరికి సమర్పించటమైతే, కూసినందుకు ఫలం ఈమె ఏమి పొందినట్లు? కోకిలకూడా ఆతలనిపొంది ఏంచేస్తుంది? తలైయల్లాల్ అన్నదానికి తలవంచి నమస్కరిం చటంతప్ప అని అర్థం తప్ప తలను నరికి తీసుకొనటం అన్న అర్థం సులభంగా చెప్పతగినదేనా? పెఱ్ఱిగారి పదానికి అర్థం వేరై ఉంటుంది. వారు చెప్పినది 'నాతలని నరికి మీకుసమర్పిస్తున్నాను' అన్నదానికి నాతలని మీపాదాలతో చేర్చి - అంటే నమస్కరించి అనికూడా అర్థంచెప్పవచ్చును. కాని నంజీయరు సాయించిన అర్థంవేరు. 'తలను - అంటే సర్వస్వాన్నీ- నీకుసమర్పించి కాల మంతా నీకాళ్ళకు మొక్కియే ఉంటాను'' అని. దాని భావమేమిటంటే ''సర్వస్య గాత్రస్య శిరః ప్రధానమ్'' అని చెప్పినట్లు ఇక్కడ తలని చెప్పినా పూర్తిశరీరాన్ని చెప్పినట్లనే అర్థం. - అంటే నేను మీకు శేషభూతుడనగుదును అన్నమాట. ఒకసారి నమస్కరించటంకాక, నాశరీరాన్నే నీకుశేషంగా చేసి నీకు నమస్కరిస్తూంటాను అని చెప్పినట్లు. శేషియొక్క శ్రీపాదాలన్నప్పుడు తిరుమేనిమొత్తం అనేభావం ఉన్నట్లే శేషుడైన చేతనుడితల అన్నప్పుడు తన శరీరంసమస్తమూ అనేఅర్థం వస్తుంది. ''చరణౌ శరణమ్'' అన్నదాన్ని గమనిస్తే ఇది స్పష్టమౌతుంది. వెనక చెప్పినట్లు ఏదీ ఈమెచేత సమర్పించబడటానికి తగినది లేకపోయినప్పుడు పూర్తిశరీరాన్నే చెప్పుకున్నా, నమస్కరించి నిలవటమే ఈమెచెయ్యగలిగినది అన్నమాట. తలైయల్లాల్ - శిరస్సుగా చేయటం అంటే శేషిగా భావించటం తప్ప అనికూడా అర్థం చెప్పవచ్చును. ''పెఱ్ఱిగారి మాటకి అర్థం ఏదైనా, ఈ ఐతిహ్యంవల్ల తెలుస్తున్నదేమిటంటే, అర్థాన్ని చెప్పేవారికి పెద్దలద్వారా తెలుసుకొనటం, ఆ సందర్భానికి సరిపోతున్నదా అని చూసుకొనటం కావాలి అన్నమాట. 6

అవతారిక: (ఏడవ పాశురం) ''హాయిగా పడుక్కున్న వటపత్రశాయి

పెరుమాళ్ళని వేగం లేచిరమ్మని చెప్తేమాత్రం ఆయన వస్తాడా? ఈమే పొద్దున్నా అక్కడికిపోయి సేవించవచ్చుగదా అనిభావించి ఈకోకిల దాగుకున్నదని తాననుకొని మరొకసారి దానితో స్వామిని పిలువమని చెప్తోంది ఈ పాశురంలో.

**మూ. పొఙ్గియ పాఱ్కడఱ్పళ్ళికొళ్వానై ప్పుణర్వతోరాశైయినాలెన్**
**కొఙ్గైకిళర్న్దుకుమైత్తుక్కుతుకలిత్తావియై యాకులఞ్జెయ్యుమ్.**
**అఙ్గుయిలే ఉనక్కెన్న మఱైన్దుఱైవు ఆழியుఙ్గఙ్గుమొణ్డణ్డుమ్**
**తఙ్గియకైయవనై వరక్కూవిల్ నీ శాలత్తరుమమ్ పెఱుతి. 7**

ప్రతిపదార్థం: **పొఙ్గియ**= అలలతోఎత్తుగా పొంగుచున్న **పాల్ కడల్**= పాల సముద్రములో **పళ్ళికొళ్వానై**= శయనించియున్న ఉపకారకుని **పుణర్వతు**= కలసి కౌగలించెకొనవలెనను **ఓర్ ఆశైయినాల్**= సాటిలేని ప్రేమచే **ఎన్ కొఙ్గై**= నా స్తనములు **కిళర్న్దు**= ఉప్పొంగి **కుమైత్తు**= మనసును కుదిపి బాధించి, **కుతుకలిత్తు**= గొప్ప ఆశతో **ఆవియై**= నా ఆత్మ(ప్రాణము)నకు **ఆకులమ్ శెయ్యుమ్**= వ్యాకులత కలుగుచున్నది **అమ్ కుయిలే**= అందమైన ఓ కోకిలా **మఱైన్దు ఉఱైవు**= నాకంటికి కనబడకుండ నీవు దాగుకొని ఇచ్చట ఉండుట **ఉనక్కు ఎన్న**= నీకు ఏమి ప్రయోజనమును కల్పించుచున్నది? **ఒణ్**= సుందరమైన **ఆழியుమ్**= చక్రమును **శఙ్గుమ్**= శంఖమును **తణ్డుమ్**= గదయును **తఙ్గియ కైయవనై**= తమంతట తాముగానిలచునట్లు ఎల్లప్పుడునుప్రకాశించు శ్రీహస్తములు గల ఉపకారకుని **వర**= నావద్దకువచ్చునట్లు **కూవిల్**= కూసి పిలచినచో **శాల**= చాల **తరుమమ్**= ధర్మ(పుణ్య)మును **నీ**= నీవు **పెఱుతి**= పొందగలవు.

వ్యాఖ్యానం -పొంగియ పాఱ్కడల్ - పాలసముద్రం ఎందుకు పొంగుతోందంటే, రెండు కారణాలని రసోక్తిగా పెరియవాచ్చాన్పిళ్ళైగారు సాయించేరు. 1. సామాన్యుడైన ఒకచంద్రుడినిచూస్తేనే సముద్రంపొంగుతుందికదా! పెరుమాళ్ళ నఖమండలాలనే పదిమంది చంద్రుళ్ళక్కడ ప్రకాశిస్తూంటే, సముద్రం పొంగకుండా ఉంటుందా? పాల సముద్రంలో పదిమంది చంద్రుళ్ళు ఎలా వచ్చేరంటే, "త్వత్పాదాబ్జే ప్రియసఖ! నఖచ్ఛద్మనాశ్రిత్య నిత్యం సద్వృత్తోభూత్ సతు

దశగుణః పుష్కలో నిష్కలఙ్కః" అని వరదరాజస్తవంలోచెప్పినట్లు, సర్వేశ్వరుడి శ్రీపాదాలలోనున్న పదివేళ్ళలోనే గుండ్రంగానున్న నఖములవలె ప్రకాశిస్తున్నవి నఖములుకావు కొన్నిదోషాలతోనున్న చంద్రుడు పెరుమాళ్ళశ్రీపాదాన్ని ఆశ్రయించి ఆదోషాలుతొలగిపోయి పదిశరీరాలనిపొంది ఆశ్రీపాదాలని అంటిపెట్టు కొని ఉన్నాడు. అవే నఖములుగాతోస్తున్నాయని సాయించటంవల్ల ఆపది చంద్రులనీ పాలసముద్రం చూసి పొంగకుండా ఉండగలదా? 2. మరొక కారణం- చంద్రమా మనసోజాతః అని పురుషసూక్తంలో చెప్పినప్రకారం పరమాత్మయొక్క మనస్సులోంచి చంద్రుడు వచ్చేడు. ఆ చంద్రుడికి పరమాత్మ తనమనస్సులోని చల్లదనంలోంచి కొంచెంమాత్రం తినిపించేడు. అటువంటి చంద్రుడినిచూసి సముద్రంపొంగితే, అతనికంటే ఎక్కువచల్లని మధురమైనమనస్సుగల స్వామినే సాక్షాత్తూచూసిన పొంగకుండా ఉండగలదా? మహాసముద్రానికి పొంగటం అనేది సహజమైనప్పటికీ, దాన్నెన్నోరకాలుగా ఉత్ప్రేక్షించవచ్చు. ఎంబెరుమానుడి కృపాకటాక్షాలింకా ఇంకాఎక్కువయ్యేసరికి పాలసముద్రంఇంకా పొంగుతుందేమో! స్త్రీయైన పిరాట్టి, పెరుమాళ్ళూ- వీరిచేర్తిగొప్పదనం చూసిపొంగిందని ఇదివరకే చెప్పుకున్నాం.

పరమపదాన్ని వదిలి పాలసముద్రానికి వచ్చి, పడుక్కున్న పెరుమాళ్ళని సంశ్లేషించాలనే అభినివేశంవల్ల నా స్తనాలు ఆలస్యాన్ని సహించలేక పెరిగి అప్పుడుకూడా ఆయన పరుగుపరుగున వచ్చి కౌగలించు కొనకపోయేసరికి "మేం నీవక్షస్థలంమీద మొలిచినందుకుగదా మాకీ కష్టం వచ్చింది. నీ దౌర్భాగ్యం మామీదకూడా వాలి, పెరుమాళ్ళు మమ్మునికూడా ఉపేక్షించేలా అయింది" అని చెప్పి అవి నన్ను దూషించిన దూషణం ఏమని చెప్పేది? అని ఆండాళ్ మొర పెట్టుకుంటోంది. ఎన్కొఙ్గై కిళర్న్దు - ఆశకి అంతులేకపోయినా, నా స్త్రీత్వానికి లోటురాకుండా ఉండాలని నేనుఒదిగి విధేయురాలినైఉన్నా, నాస్తనాలకి అటువంటి విధేయత లేదని ఆండాళ్ అంటున్నట్టున్నదంటారు అణ్ణంగరాచార్యులవారు.

కూర్చునిగాని, నిలచిగాని ఉన్నవానిని పిలిస్తే తొందరగా రాగలుగును. పడుక్కొన్నవానిని చూడాలని కోరుతున్నానని తెలుసుకున్న ఓ కోకిలా! నాస్తనాలు ఆపడుక్కున్నస్వామితో కలవాలనీ, ఆయనవల్లనే కౌగలించుకొనబడాలనీ కోరుతూ నన్ను చాలాబాధిస్తున్నాయి. పిరాట్టిఉండే పాలసముద్రంచేరి, ఆమెతోకలసి పడుక్కున్న ఆ స్వామికి ఆమెమీదఉన్న ప్రేమనిచూసి నేనుకూడా నేనున్నచోటికి

ఆయన నామీదప్రేమతో అలాగ రావాలని కోరుకుంటున్నాను. పిరాట్టితోకలవాలనే గొప్పఆశతో పొంగుతున్న పాలసముద్రాన్నికూడా లెక్కచెయ్యకుండా దాని మధ్యన పడుక్కొన్నాడాయన. పాలసముద్రంకూడా ఇటువంటిఅల్లుడు దొరికేడే అని ఉప్పొంగిపోతోంది. మాతండ్రిగారుకూడా అట్లానే ఆనందంతో పొంగిపోవాలి. కొజ్ఞై కుతుకలిత్తు కిళర్న్దు - మా కష్టదశని చూచి తెలుసుకొని ఆస్వామి హడిలిపోయి వస్తున్నాడని భావించినస్తనాలు మహాప్రభువులని ఎదుర్కొన బయలుదేరిన వాళ్ళలాగ చాలాహడావిడిచేస్తూ ఉప్పొంగటం చూడండి అంటున్నదట ఆండాళ్. కుతుకలిత్తు "కుతూహలం" అన్న సంస్కృతపదాన్ని ఒకక్రియాపదంగా తీసికొని దానికి క్రియాప్రత్యయాన్నిచేర్చి చెప్పటం జరిగింది. ఆకులం అన్నదికూడా సంస్కృతపదమే. ఆకులం చెయ్యటం అంటే కలతపెట్టటం, హింసించటం.

కుమైత్తు - నేను ధైర్యంగా ఉండటానికి ప్రయత్నించినా ఆస్తనాలు నన్ను బాధించి ఉప్పొంగుతున్నాయి. కుమైత్తు ఆవియై అనిఆవియై అన్నపదంతో కలిపి చెప్పటం కూడా ఉన్నది.

ఆతోటలోని కోకిల "ఇప్పుడు నేను ఈమెకి కనబడితే నన్నీమె వదలదు, "ఎన్‌శెయ్యతామరైక్కణ్ పెరునార్‌కెన్ తూదాయ్, ఎన్ శెయ్యుమురైత్తక్కాల్ ఇనక్కుయిల్‌కాళ్" అని తిరువాయ్‌మొ 1-4-2లో చెప్పినట్టు ఈమెకూడా మనలని దూతకార్యానికి వెళ్ళమని కాళ్ళమీద పడేటట్లున్నది. ఈ వేడిలోనూ, అడవుల్లోనూ వెళ్ళటానికి నాకు సాధ్యంకాదు, కాని, పాల సముద్రంలోఉన్న పెరుమాళ్ళమీద ఈమెకి ఆశ. అక్కడికి వెళ్ళటానికి ఎవరివల్ల అవుతుంది? అంచేత ఈమెకి మనం ముఖం చూపించకుండా తలదాచుకోవటమే మంచిది" అని భావించి ముఖంకూడా చూపించకుండా, మాట వినపడకుండా దాగుకొని ఉన్నది. అలాఉన్న ఆకోకిల అనుకున్నదేమిటో తెలుసుకున్న ఆండాళ్ "అమ్‌కుయిలే-అందమైన కోకిలా" అని పిలిచింది. నేనీవిధంగా కష్టపడుతూండటం, నువ్వు మెత్తని పూలపాన్పుమీద నీడపడుతూంటే నిద్రపోయి కనబడకుండా తలబైటికి చూపిస్తే, నీ అందానికి లోటువస్తుందనుకునిగదా నా కష్టనివారణని ముఖ్యమైనదిగా తీసుకొనకుండా నీ అందాన్నే ముఖ్యమైనదిగా అనుకుంటున్నావు ఇదిబాగుందా? అన్న ఉపాలంభం కనబడేటట్లు అందమైన కోకిలా అని పిలుస్తున్నది. నువ్వెప్పుడూ కనబడకుండానే ఉంటావుగనుక, నీశరీరసౌందర్యం చక్కగాఉన్నది. కాని, అందానికితగిన ఆత్మగుణ ముంటేగదా దానికిగొప్పతనం. "గుణాద్రూపగుణాచ్చాపి" అన్నాడాదికవి వాల్మీకి.

సీతాదేవిగుణాలని తెలుసుకొని ముగ్ధుడైనతరువాతనే ఆమెశరీరసౌందర్యపు గొప్ప దనం అంగీకరించేడట రాముడు. అందుచేత నువ్వు ఉపకరించటానికి ముందుకి రావాలి అని అంటున్నదన్నమాట. నువ్వు మిగతా కోకిలల్లాగ ఉన్నట్లైతే నిన్ను శ్రమపెట్టాలని అనుకోకపోదును. నువ్వందమైన కోకిలవికదా! నీ అందం చూసిన నేను, ఆఅందానికి చెరుపువచ్చేటట్లు నిన్నుశ్రమపెట్టాలని అనుకుంటానా? పడుక్కున్నవాడు లేచిరావటం శ్రమ అంటావా? పాలసముద్రంలో పడుక్కున్న ఆయనే 'తమద్భుతం బాలకమంబుజేక్షణం చతుర్భుజం శంఖగదాద్యు తాయుధం.' అన్నట్టుగా చక్రం,శంఖం, గద- ఈమూడూ వాటంతట అవే ఆయన చేతుల్లో అమరిఉండేటట్లు తొందరగావచ్చి నాకృష్ణుడుగా అవతరించికటాక్షించేడు. నాలుగుచేతులుండగా మూడేఆయుధాలు వచ్చేయే! ఎందుకోతెలుసా? నాస్తనాల ఆరాటాన్నిచూసి, అవి ఉండటానికి స్థానం కావాలని ఒకచెయ్యి ఏఆయుధాన్నీ పట్టుకొనకుండా ఉంచుకున్నాడు.

ఉనక్కెన్నమఱైన్దు ఉఱైవు? - ఇటువంటి వాడి గుణాలేమిటో తెలియ కుండగనే నువ్వు ఏదో దాక్కొని కూయకుండా ఉన్నందువల్ల నీస్థానం నిలిచి ఉంటుందా అనినువ్వేచూసుకో. క్షీరార్ణవనికేతనుడైననారాయణుడిని రమ్మని పిలిస్తే నిన్నిక్కడినుండి తోలివెయ్యడు. నువ్వు ఎక్కడికీ దౌత్యం చెయ్యటానికి వెళ్ళనక్కరలేదు. నువ్వున్నచోటే ఉండి ఆస్వామి ఇక్కడికి వచ్చేటట్టు కూస్తే అదే మహోపకారం. నాకుమాత్రం మంచిదికాదా, నువ్వూ ఒకమాటమాత్రంతో గొప్ప పుణ్యం చేసినదానివవుతావు. ''నేను కూస్తే ఆపెరుమాళ్ళు పరుగుపెట్టిరావటానికి సిద్ధంగా ఉన్నాడా అని అనకు. ''నమ్మేల్వినైకడివాన్ - ఎప్పోతుమ్ కైకழలా నేమియాన్'' అనిన్నీ, ''పాతు ప్రణత రక్షాయాం విళమ్బమసహన్నివ సదా పంచాయుధీం బిభ్రత్ సనః శ్రీరంగనాయకః'' అని శ్రీరంగరాజస్తవంలో చెప్పి నట్లున్నూ నావంటిఆర్తులని తొందరగావచ్చి కటాక్షించాలని ఆయన దివ్యాయుధాలని క్షణకాలంకూడా చేతిలోంచి వదలకుండా ధరించి ఉండటం నీకు తెలియదా? ఇదివరకే ఇక్కడికి వచ్చి కటాక్షించటంలో ఆదరమున్న ఆయన నీకూత వినబడగానే రాకుండా ఉంటాడా? గాభరాపడుతూ బట్టైనా సరిగ్గా సర్దుకొనకుండా ఆ గజేంద్రుడిని రక్షించటానికి వచ్చినట్లు నాకోసం వస్తాడు. అందుచేత నువ్వు కూయాలి అంటున్నది.

తరుమమ్ పెఱుతి- నువ్వు పిలిస్తే అది గొప్పధర్మమే, పుణ్యమే

అవుతుంది. నువ్వు నాకు చెయ్యవలసిన ధర్మం- విశేషంగా పుణ్యమనే ధర్మ మొకటి ఉన్నది. నువ్వా ఎప్పుడూ ఇట్లానే నీగుంపుతో కలిసిఉండవచ్చు. ధర్మాల్లో ఉత్తమమైన ధర్మం శరణాగతరక్షణం. కపోతోపాఖ్యానం నీకుతెలియదా? అదున్న చోటికే వచ్చి శరణమన్న శత్రువైన వేటగాడినికూడా అదిరక్షించిందే. ఇది నువ్వున్న చోటైతే నేనుకూడా శరణాగతురాలినే అని అనుకోవచ్చు. పిరాట్టి హనుమని చూసి, "జీవన్తీం మాం యథారామస్సంభావయతి కీర్తిమాన్ తత్ తథా హనుమన్ వాచ్యం వాచా ధర్మమవాప్నుహి" (రా.సుం.39-10)- నీ మాటలవల్ల పుణ్యాన్ని పొందుతావు గదా! అనిచెప్పినప్రకారం, నువ్వు నీనోరారా ఒక్క మాటతో ఆయనని రమ్మని పిలిస్తే గొప్పధర్మాన్ని చేసినదానివవుతావు అని అంటోంది. అంటే ఎంతో పుణ్యం సంపాదిస్తావని చెప్తున్నది. ఎలాగ అంటే ఒక్క ఆండాళ్‌నే కాక ఈశ్వరుడితోపాటు జగత్తునే రక్షించినదానివౌతావుగదా: అంటోంది. అంటే ఈ కోకిలగాని స్వామిని పిలవకపోతే, ఆయన రాక, ఈమె నశించిపోతుందికదా! ఈమె నశించటం అంటే ఆయనకూడా మరి ఉండడుగదా! ఆయన లేకపోతే మరి ఈవిభూతులఎక్కడ ఉంటాయి? ఆవిధంగా ఈఉభయవిభూతులనీ, ఆయననీ రక్షించిన పుణ్యం అంతా నీకు కలుగుతుందని అంటోందన్నమాట. ఆనాడు రాముడు కూడా హనుమతో తననే కాకుండా భరతుడినీ, లక్ష్మణుడినీ, మా రఘువంశాన్నీ కూడా రక్షించి గొప్ప పుణ్యం కట్టుకున్నావయ్యా- "అహం చ రఘువంశశ్చ లక్ష్మణశ్చ మహాబలః। వైదేహ్యా దర్శనేనాద్య ధర్మతః పరిరక్షితః" అని అన్నట్టు రామాయణంలో యుద్ధకాండ 1-12లో చెప్పబడింది. 7

అవతారిక: ఎనిమిదవ పాశురం. నిన్ను స్తనములు వ్యాకులపెట్టుతున్నా యని ఇంతవరకూ తప్పించుకున్నావే. నువ్వుకూడా ఆయనని వ్యాకులపెట్టి నిన్ను వదిలి దూరంగా వెళ్ళలేనివిధంగా చెయ్యలేదా?ఇట్లా మాటిమాటికీ మమ్ములని కావాలని దుఃఖపెట్టుతున్నావు. అంతేకాక ఇంతవరకూ నిన్ను కన్నెత్తి చూడని వాడు, ఇప్పుడు నేను పిలిస్తే మనసుమార్చుకొని వస్తాడా? అలా వద్దామని అనుకున్నా, ఎన్నో విఘ్నాలచేత దానికి అడ్డురావచ్చు అన్నట్లుగా కోకిల చెప్తుందని భావించిన ఆండాళ్ దానికి సమాధానంగా ఈ పాశురాన్ని చెప్పుతున్నది.

*మూ. శార్ఙమ్వళైయవలిక్కుమ్ తడక్కై చ్చతురన్పొరుత్తముడైయన్*
*నాఙ్గళెమ్మిలిరున్దొట్టియకచ్చఙ్గమ్ నానుమవనుమఱిదుమ్.*
*తేఙ్గనిమామ్బొழிల్శెన్దళిర్కోదుఙ్గుఱుకుయిలే తిరుమాలై*
*ఆఙ్గువిరైన్దొల్లైకూవకిற்றియాకిలవనైనాన్ శెయ్వనకాణే. 8*

ప్రతిపదార్థం: ***తేమ్***= తియ్యని ***కని***= పండ్లుగల ***మామ్పొழிల్***= మామిడితోటలో ***శెమ్ తళిర్***= ఎఱ్ఱని చిగుళ్ళను ***కోతుమ్***= ముక్కుతో త్రుంచి తినునట్టి ***శిఱు కుయిలే***= లేతకోకిలా! ***శార్ఙమ్***= శార్ఙమను విల్లు ***వళైయ***= నారి ఎక్కుబెట్టుటకు వంచునట్లు ***వలిక్కుమ్***= బలమునుపయోగించు ***తడ కై***= విశాలమైనశ్రీహస్తములు గల ***చతురన్***= సకలవిధమైన సామర్థ్యము గల(శత్రువులనందరను జయించగల) శక్తిమంతుడైన ఉపకారకుడు ***పొరుత్తమ్ ఉడైయన్***= ప్రణయంలో కూడా తగినవాడు ***నాఙ్గళ్***= మేము ***ఇరున్దు***= కలసి ఉన్నపుడు ***ఎమ్మిల్ ఒట్టియ***= మేము ఒప్పుకొని చేసిన ***కచ్చఙ్గమ్***= నిశ్చయ(ఒప్పంద)మును ***నానుమ్ అవనుమ్***= నేనును, ఆయనయు ***అఱిదుమ్***= ఇద్దరమే తెలసినవారము ***ఆఙ్గు***= అక్కడే ***విరైన్దు***= ఉత్సాహముతో కావలెని ***ఒల్లై***= తొందరగా ***తిరుమాలై***= శ్రియఃపతిని ***కూ(వు)కిற்றి ఆకిల్***= నీవుకూసి పిలిచినచో ***అవనై***= (వెంటనేవచ్చునట్టి) అతనిని ***నాన్***= నేను ***శెయ్వన***= పెట్టు పాట్లను ***కాణ్***= ప్రత్యక్షముగా చూడగలవు.

వ్యాఖ్యానం-మొదటిపాదంలోని రెండువిశేషణాలున్నూ రామాయణంలో "అప్రమేయం హి తత్తేజో యస్య సా జనకాత్మజా। న త్వం సమర్థస్తాం హర్తుం రామచాపాశ్రయాం వనే" అని చెప్పినట్లుగా ఎంబెరుమానుడి వీరత్వాన్నీ, తన వాళ్ళపైన ఆయనకున్న ప్రీతినీ తెలుపుతాయి. "యో వజ్రపాతాశని సన్నిపాతాత్ న చుక్షుభే నాపి చచాలరాజా। స రామబాణాభిహతో భృశార్తః చచాలచాపఞ్చ ముమోచవీరః॥"అని రామాయణం యుద్ధకాండ(59-139)లో వాల్మీకి సాయించి నట్లుగా తనచూపులతోనే శత్రువులు ధనుర్బాణాలని పడవేసి వెన్నుచూపిపారి పోయేలాగ తనశార్ఙాన్ని ఎక్కుపెట్టగల మంచివీరత్వమున్నవాడు అంటుంది మొదటి విశేషణం. అంతఃపురంలో శృంగారరసాన్ని చూపటంలోకూడా తగిన ప్రణయత్వాన్ని ప్రదర్శించదగిన చాతుర్యంగలవాడని పొరుత్తముడైయన్ అనే రెండో విశేషణం చెప్తుంది. ఈ రెండువిశేషణాలవల్లా చెప్పినదేమంటే - ఆస్వామి

నాదగ్గరకు రావాలనుకుంటే దాన్ని అడ్డుకొనే శత్రువులందరినీ జయించే శక్తిగల శార్‌ఙ్గపాణి నావద్దకు రావటానికి ఆటంకాలేమీ ఉండవు. నామీద ప్రేమమున్నది గనుక, శృంగారచేష్టలలో చాతుర్యమున్నవాడనీ చెప్పటం జరిగింది. నన్ను ఆయన ఉపేక్షిస్తాడని అనుకోవద్దు. ఆయన చిత్తవృత్తికూడా నామనోవృత్తికి తగినవిధంగానే ఉన్నది. ఇదివరకు నేనూ, ఆయనా ప్రతిజ్ఞలు చేసుకొనినప్పుడే మేం ఇద్దరం నేను నిన్ను వదలి బ్రతకలేను, నేను నిన్ను వదలి బ్రతకలేను అని ఒకళ్ళతో ఒకళ్ళం చెప్పుకున్నాం. నామీద ప్రేమ ఉన్నవాడని నేను తెలుసు కున్నాను. ఇది కేవలం మాటమాత్రమే కాకుండా చేతలుగా మారటానికి నీ సహాయం కావాలి. అది నువ్వు చెయ్యవలసినది అని చెప్తున్నదని భావం.

మూడో పాదం కోకిలని సంబోధించటం. నా కష్టాలని చూస్తున్న నువ్వు వెంటనే ఎంబెరుమానుడిని, నన్నూ కలిపే ప్రయత్నం చేయాలి అంటోంది. కాని నీకాదృష్టే లేదే, నీ కడుపు నిండటమే ప్రయోజనంగా నువ్వు చూసుకుంటున్నావు. మంచితియ్యని మామిడిపండ్లు నిండుగానున్న మామిడితోటలో ఎర్రని చిగుళ్ళని ముక్కుతో తుంపి అదే పనిగా ఉన్నావే! అని ఆకోకిల చెవిలో గట్టిగా పడేటట్లు చెప్పింది. అదివిన్న ఆ కోకిల "అమ్మమ్మ! నీకు కావలసినదాన్ని చెయ్యటానికి నేను సిద్దంగా ఉన్నాను. నేనేం చెయ్యాలి? చెప్పు" అన్నది. చెయ్యిజారిపోయిన ఆయన తిరిగి ఇక్కడికి తొందరగా పరుగుపరుగున వచ్చేలా నువ్వు కూయాలి ఇదే నాకు నువ్వుచేసే మహోపకారం" అన్నది. దానికి, ఆకోకిల అమ్మ! ఎంబెరుమానుడితో నీకు సమాగమం అయ్యేలా చూడమని నువ్వంటున్నావు అది అంత సులువైనదికాదే ఇంతపెద్దకార్యాన్ని నేను సాధిస్తే నాకేం ప్రతిఫలం ఇద్దామని అనుకుంటున్నావు?" అని అడిగింది. "అవనై నాన్ శెయ్‌వన కాణే - ఆయన్ని నేనేం చేస్తానో చూడు" అని జవాబు చెప్పింది. అంటే, నువ్వు కూసినవెంటనే ఆయన ఇక్కడికి వచ్చి చేరగానే, ఇన్నాళ్ళు నన్ను పెట్టినపాట్లన్నీ ఒకక్షణంలో ఆయన నాకంటిచూపుకోసం ఎదురుచూసేలా చేస్తాను ఆవినోదాన్ని చూడటం నీకు ఏమైనా తక్కువదా? పరమప్రయోజనంగదా! అది చాలదా?" అన్నది. అంతకుముందే నేను రహస్యంగా ఆయనతో కలిసిఉండటంచేత ఆయనని స్వాధీనపరుచుకొనలేనిదానినని అనుకోవద్దు. నాశక్తిని ఉపయోగించి నేనేంచేస్తానో నువ్వే ప్రత్యక్షంగా చూద్దువుగాని. దానికోసం ఆయననిపిలుస్తూ నువ్వుకూయాలి. రానివాడిని రావాలని ఎందుకు స్తనాలపొంగుదలని చూపిస్తున్నావని నన్నుచూసి

అంటున్నట్లు కూయకుండా ఉన్నావే. ఏమి, ఎవరిని నాయకుడిగా నావయస్సుని ఉపయోగించుకునేవాడని అనుకుంటున్నావా? మంచితియ్యని పండ్లతోనిండిన మామిడితోటలో మామిడిపళ్ళని వదిలి, వగరుగా ఉండే చిగుళ్ళని తుంచితినే నీలాంటిదాన్ని అనుకున్నావా నన్ను? శార్ఙ్గం వదిలిన బాణాలవర్షంతో రావణుడిని జయించిన రాముడిదగ్గరా, శిశుపాలుడిని వధించిన కృష్ణుడిమీదనూ సీతాదేవికీ, రుక్మిణీదేవికిన్నీ ఉన్న స్థితే నాస్థితి అని నీకు తెలియదా? ఆయనని వదిలి ఇతరుడిమాట నాదగ్గర తలవటం కూడానా? "అనన్యా రాఘవేణాహం భాస్కరేణ ప్రభా యథా", "తథా ద్విరదవద్రామః త్వం నీచ శశవత్స్మృతః" అన్నస్థితే నా స్థితి అంటున్నది.

కచ్చఙ్గమ్అంటే ప్రతిజ్ఞ లేకసంకేతం అనిచెప్తారు. ఇది ఒకతమిళ జాతీయమా లేక వేరుభాషాపదవికారమా?. కచ్చమ్ అంటే నిశ్చయం కమ్ అంటే పని. అంటే ఒకనిర్ణయం తీసుకొనటమని అర్థంవస్తుంది. ఈపదాన్నే ఇక్కడ చెప్పటానికి (ప్రయోగించటానికి) వేరేఅర్థం ఉండవచ్చు. అంటే కచ్చు+అంగం కచ్చంగం. కచ్చు అన్నది పాలిండ్లకట్టు. ఇదివరకు రహస్యప్రదేశంలో ఇద్దరూ ఆలింగనంలో మేముండటం మాకుమాత్రమే తెలుసును అని చెప్పటం అన్నమాట.

తేఙ్గని ఇత్యాదికి మామిడితోటలో తియ్యని మామిడిపళ్ళని తిని, మార్పు కోసం చిగుళ్ళనితుంచి తినేచిలుకా అనిపెరియవాచ్చాన్పిళ్ళై అర్థం సాయించేరు. విరైన్దు అన్నదానికి వేగాన్ని చెప్పటంకాదు. ఒల్లై అన్నపదం దాన్నిచెప్తుంది. విరైదల్ అంటే కావాలని అనుకొనటం. కూసేటప్పుడు మనస్సు కుదుటబడి ఉత్సాహం, శ్రద్ధలతో కూయటం అని అర్థం చెప్తారు ఉత్తమూర్‌వారు.

అవనై నాన్‌శెయ్‌వన కాణే - ఈమె చేసేవి ఏమిటి? కాళ్ళతోటీ, చేతులతోటీ కుమ్మోద్దామని అనుకుంటోందా? కుక్కా, రాక్షసుడా అని తిట్లు తిడదామను కుంటోందా? స్తంభానికికట్టి, కొడదామనుకుంటోందా? - అవేంకాదు. ఆయన వచ్చి నిల్చుంటే, ఆయనకి ముఖం చూపించకుండా ముఖం త్రిప్పుకొని ఉందామని అనుకుంటోంది. చాలారోజులు ఉపవాసం చేసి ఉన్న వాడిముందర అన్నం పెట్టి, దాన్ని వాడు తినలేక బాధపడుతూంటే, ఆ ఆకలికూటివాడు ఏమిపాట్లుపడుతాడో, ఆపాట్లన్నీ ఆయనపడాలి ఇలాంటిపని చేసినందుకు"అని అనుకుంటున్నదన్న మాట. ఇక్కడ "పొయ్యచ్చమ్ కాట్టి నీపోదియేలుమ్ ఇన్న మెన్‌కైయకత్తు ఈఙ్గోరు నాళ్ వరుతియేల్ ఎన్‌శినమ్ తీర్‌వన్‌నానే - కృత్రిమమైన భయం చూపి, నువ్వు

వెళ్ళిపోయినా, ఇంకమీదట నాచేతికి ఎప్పుడైనా చిక్కవా? అప్పుడు నారోషం తీర్చుకొననా?'' (పెరుమాళ్ తిరుమొ 6-8) అన్నపాశురఖండవ్యాఖ్యానం ఇక్కడ అనుసంధించ తగినది. ''వణ్డార్ పూమామలర్ మజ్లై మణనోక్కముణ్డానే'' అని పాయించినట్లుగా నాయకి కటాక్షవీక్షణాలనే భోజనంగా భావించిన ఆస్వామికి ఆ భోజనం లభించకపోతే అంతకిమించినశిక్ష లేదుకదా! మరొకవిధంగా, కాళ్ళతోటి, చేతులతోటి గుద్దులుతినటం ఇదంతా ''మమశిరసి మణ్డనం గోపికాతాడనమ్'' అని భావించిన ఎంబెరుమానుడికి పరమభోగ్యంగానే ఉంటుందిగనుక, అవన్నీ, శిక్ష కాదు, ముఖం త్రిప్పుకోవటమే పెద్దదండన అని భావం. ఇటువంటి శిక్షని ఆయనకి నేనుచేసినప్పుడు అది నువ్వుచూస్తావుగదా! అటువంటిసన్నివేశం సులభంగా నీకు దొరుకుతుందా? ఆపరమప్రయోజనంకోసమని నువ్వుకూయుమా అనిఅంటున్నది.

లోకంలో ప్రణయకలహంపొందే స్త్రీలుచేసే చేష్టలన్నీ చేద్దామని అనుకుంటున్నదని చెప్పవచ్చు. అకలకిల్లేన్ ఇఱైయుమ్ అని చెప్పే లక్ష్మీదేవిలాగ నేనుకూడా ఉన్నాను. ఆయననివదలి ఉండటమనేదే ఉండదు ఆమే ఇట్లా నన్ను బాధించటం సహిస్తుందా అన్నట్టు చెప్పేమాటలని చెప్పినట్టుగా భావించవచ్చు. లేక, పొదవుగా బల్లెంచివరలవంటి కళ్ళున్న నాకే శార్ఙ్గాన్ని వంచి నారిని ఎక్కు పెట్టగల చాతుర్యంగల ఆయనే నాకు సరియైనజోడీఅయినవాడు. అటువంటివాడు ఆచాతుర్యం పోగొట్టుకొని నాచూపులకోసం ఎదురుచూస్తూ నిలబడేటట్లుచేసే నేను నాపొడవైన కళ్ళతోచూడటమేచాలునే, నన్నుదూరంచేసుకొని ఆమాధుర్యాన్నే వదులుకున్న ఆయన నాపొడవాటికళ్ళని చూద్దామని కోరినా కన బడని విధంగా ఉండి ఆయనని ఆటాడిస్తాను అని అంటున్నదనీ చెప్పవచ్చును. 8

అవతారిక: తొమ్మిదవ పాశురం - కూయాలని అనడం విని ఉన్న కోకిల ఏదో మరొకవైపు చూస్తున్నదని ఆండాళ్ భావించి దానికి తగినట్లుగా చెప్తూ వచ్చింది. తుమ్మెదలు ఝుమ్మంటూ తిరుగుతున్న తోటలో ఉండడంవల్ల చెప్పినది చెవిలో పడలేదని అనుకొని ఇప్పుడు తెలియచెప్తోంది. ఒకసారి చెవిలో పడటం, ఇది నా చెవిలో పడలేదే అని తరవాత చెప్పుదామని అనుకున్నది. ఆతరువాత చెప్పటం ఈ పాశురంలోని విషయం.

మూ. పైజ్గిళివణ్ణన్ శిరీతరనెన్బదోర్‌పాశత్తకప్పట్టిరున్దేన్
పొజ్గొళివణ్డిరైక్కుమ్ పొழிల్‌వాழ் కుయిలే కుఱిక్కొణ్డితు నీకేళ్
శజ్గొడుశక్కరత్తాన్ వరక్కూవుతల్ పొన్‌వళైక్కొణ్డుతరుతల్
ఇజ్గుళ్ళకావినిల్ వాழக్కరుతిలిరణ్డత్తొన్దేల్ తిణ్ణమ్‌వేణ్డుమ్ 9

ప్రతిపదార్థం: **పొజ్గు**= ఎక్కువగుచున్న **ఒళి**= కాంతిగల **వణ్డు**= తుమ్మెదలు **ఇరైక్కుమ్**= ఝుంకారముచేయుచున్న **పొழிల్**= తోటలో **వాழ் కుయిలే**= ఆఝుంకారంలో అభినివేశంతో బ్రతుకుతున్న ఓ కోకిలా! **కుఱిక్కొణ్డు**= గుర్తుంచుకొని **ఇతు నీకేళ్**= నేను చెప్పేదాన్ని విను **పైజ్గిళి**= పచ్చని చిలుకవంటి **వణ్ణన్**= రంగుగల **శిరీతరన్**= శ్రియఃపతి **ఎన్బతు**= అనబడుతున్న **ఓర్**= సాటిలేని **పాశత్తు**= వలలో **అకప్పట్టు ఇరున్దేన్**= చిక్కుపడి ఉన్నాను **ఇజ్గు ఉళ్ళ**= నేనున్న చోటనున్న **కావినిల్**= తోటలో **వాழ కరుతిల్**= నువ్వు ఉండాలనుకుంటే **శజ్గొడు శక్కరత్తాన్**= శంఖచక్రాలున్నవాడు **వర కూవుతల్**= వచ్చేటట్టు ఆయనని నువ్వు కూసి పిలవటమో, **పొన్‌వళై**= నాబంగారుకంకణాన్ని(గాజుని) **కొణ్డుతరుతల్**= తీసుకొని ఆయనవద్దకి వెళ్ళి ఇయ్యటమో **ఇరణ్డత్తు**= ఈ రెంటిలో **ఒన్రు**= ఏదో ఒకటి **తిణ్ణమ్**= తప్పకుండా (నీచేత) **వేణ్డుమ్**= చెయ్యబడవలెను.

వ్యాఖ్యానం- నాబాధ నాఅంతటనేను తీర్చుకొనగలిగిన బాధ కాదువలె ఉన్నది. ఆయన విగ్రహసౌందర్యానికీ, ఆయనప్రణయత్వానికీ నేను పరవశురాలినై, కాళ్ళూ చేతులూ అందని స్థితిలో ఉన్నాను. నా వశంలో ఏమీ లేక ఎక్కడుంటే అక్కడే తప్ప కదలలేని స్థితి నాది. ఓ కోకిలా! నామొర నీచెవికి వినబడకుండా తుమ్మెదలఝుంకారంతో నిండిపోయిన తోటలో ఆగానం వింటూ, అదే పనిగా నువ్వు తిరుగుతున్నా, నిన్ను నేను వదలలేను. నామొరకూడా నీచెవికి వినిపిస్తాను విను. ఏదో వింటున్నానని వినటం కాకుండా తుమ్మెదలపాటనుంచి చెవిని ఇటుత్రిప్పిపెట్టి నామాటని జాగ్రత్తగా శ్రద్ధగా విను. నేనేం చెప్తున్నానంటే, ఇప్పుడు నేను పడుతున్న బాధని నాఅంతట నేను తీర్చుకొనలేను. సర్వేశ్వరుడి విగ్రహసౌందర్యంమొదలైనవాటికి వశపడి కాళ్ళుచేతులూ ఆడకుండా, ఉన్నచోటి నుంచి కదలలేనిస్థితిలో ఉన్నాను. అంటే, "మున్నైయమరర్ ముదల్వన్ వణ్ తువరాపతిమన్నన్, మణివణ్ణన్ వాసుతేవన్ వలైయుళే అకప్పట్టేన్ - ఆదిదేవుడు,

దేవాదిదేవుడు, ద్వారకాధిపతి, నీలమణివంటి విగ్రహంగలవాడు అయిన వాసు దేవుడి బంధంలో చిక్కుకున్నాను'' అని అన్నది. ఇదివిన్న కోకిల ''అమ్మ! ఈ క్షేమసమాచారం చెప్పటానికా నన్ను పిలిచేవు; నువ్వు వలలో చిక్కుకుంటే నేనేం చెయ్యగలను?'' అని చెప్పి తిరిగి తుమ్మెదలగానం వినటంలో ఇటువైపు పరాకుగా ఉన్నది తరువాతి పాదాల్లో పరుషంగా చెప్తున్నది. ''కోకిలా! నువ్వు ఈతోటలో ఉండి బతకాలి. నన్ను అలక్ష్యం చేస్తేమాత్రం ఇందులో నువ్వు బతకగలవా? నేను నశించిపోతే, ఈతోటని నీకు తగినట్లుగా ఎవరు చేస్తారు? తరువాత ఉండడానికే చోటులేక బాధపడుతావు. ''వానవర్నాట్టై అవన్నోక్కి వైత్తు కొడుక్కుమ్ అన్నట్టుగా ఈ తోటంతటినీ ఈ కోకిలకోసం ఈమె రక్షించి ఉంచుతుందన్నమాట. నువ్వు సుఖంగా ఇక్కడ బ్రతకాలని జీవించాలని కోరుకుంటే, నీకు రెండుపనులు చెప్తాను. రెంటిలో ఏదో ఒకటి నువ్వు చెయ్యాలి. అవి ఏమిటంటే, కుడిచేత చక్రం, ఎడంచేతిలో శంఖం ధరించిన ఎంబెరుమానుడు ఇక్కడికి వచ్చేటట్లు కూయటం ఒకటి. నాచేతికంకణాలని తీసుకువచ్చి ఇవ్వటం ఒకటి. ఈ రెంటిలో ఏదోఒకదాన్ని నువ్వు చేసితీరాలి. అని అంటోంది.

ఈ వికల్పం తాలూకు భావం ఏమిటంటే, చేతిగాజులని తీసికొని, ఇవ్వటం ఎట్లా? (చేతిగాజులు ఎట్లా పోయేయో ఈ తిరుమొమొదటిపాశురవ్యాఖ్యానంలో వివరించబడింది) ఎంబెరుమానుడి విశ్లేషంచేత, చేయిజారి పోయినగాజులని తిరిగి తీసుకొనిరావాలి అంటే, జారిపోయిన గాజులు చేతినుంచి జారిపోకుండా ఉండే టట్లు చెయ్యాలన్నమాట. ఇది ఎంబెరుమానుడి సంశ్లేషంతోతప్ప మరేవిధంగాను జరిగేదికాదు. ఆసంశ్లేషంకూడా, ఆస్వామివస్తేతప్పజరగదు. ఇలాఉంటే, శంఖచక్ర ధారి రావాలని పిలుస్తూ కూయటం ఒకపక్షంగానూ, బంగారు గాజులు తీసివ్వటం అనేది మరోపక్షం. ప్రత్యేకత కనబడేటట్లు చెయ్యటం ఎలా? మామిడిపండు కావాలి, మామిడిపండు కావాలి'' అంటున్నట్లుగా వ్యాహతమై ఉండటమే ఇది కూడానని అనుకునేటట్లుఉంటోంది. అయినా, ఇది ఒకచమత్కారం అని తీసుకోవాలి. పతివ్రతాశిరోమణియైన సావిత్రి తనప్రియుడైన సత్యవంతుడి ప్రాణాలని తీసుకొనిపోయిన యముడిని నమస్కరించి ఆప్రాణాలని తిరిగి ఇచ్చెయ్యాలని ఎన్నోవిధాలుగా ప్రార్థించినా, దానికి అంగీకరించకపోగా, ఆమె అడుగుతున్నంతసేపూ అతను ఎన్నోధర్మసంబంధమైన విషయాలని సంతోషంతో చెప్తూంటే, ఆయముడికి మతిమరపుకలిగించి ''సత్యవానుడినుండి నాకు ఎంతో

మందిపిల్లలు కలిగేటట్లు కటాక్షించాలి" అనివరం కోరగా అతనుకూడా అలాగనే ఇచ్చేనని ఆశీర్వదించేడని ఒక ఇతిహాసం ఉన్నదికదా! అందులో నాయకుడి ప్రాణాలని ప్రార్థించి వాటిని పొందని ఆమె సంతతికావాలని కోరటం వ్యాహతమై ఉన్నా, ఎట్లా తనకోరికని నెరవేర్చుకొనదల్చిన సావిత్రితాలూకు చాతుర్యోక్తితో దానిని పొందిందో అట్లాగనే ఇక్కడకూడా శంఖచక్రధారివచ్చేలా కూయటంబంగారు గాజులని తీసి ఇవ్వటం పర్యాయక్రియలే అయినా, ఇది ఒక చమత్కారమైన పదప్రయోగం కావటంవల్ల తనకోరిక ఎలాగైనా తీరుతుందన్నమాట. "ఒరు కార్యత్తాలే ఇరణ్డుమ్ తలైక్కట్టుమిఞే - ఒకే బాణంతో రెండుపిట్టలు" అన్నట్లుగా ఒకేపదప్రయోగంతో పూర్తిచేసేరు పెరియవాచ్చాన్పిళ్ళై అంటారు అణ్ణంగరాచార్య స్వామి.

నారాయణాది నామాలని చెప్పకుండా శంఖచక్రధారి అనటంవల్ల ఆయన ఆభరణాలతో సహా ఇక్కడికి వచ్చి చేరవలెను, లేక నా ఆభరణంతీసి ఇయ్యి అన్న రసోక్తి ప్రకటితమౌతుంది.

మొదటిపాదంలో పాశం అని చెప్పటం తత్సమశబ్దం. తాడు అని అర్థం వస్తూ వల అనికూడ అర్థం వచ్చేలా ప్రయోగించబడింది "కార్తణ్ కమలక్కణ్ణ నెన్నుమ్ నెడుఙ్గయిఱు - వర్షాకాలమేఘంలా చల్లని తామరలవంటి నేత్రములుగల పుండరీకాక్షుడనే దీర్ఘ మైన బంధం" అని వలని బంధంగా చెప్పటంకూడా ఉన్నది.

పైఙ్గిళివణ్ణన్ శిరీతరన్- ప్రారంభంలో మాధవన్ మామణివణ్ణన్ అని మొదలుపెట్టింది ఈమె. పచ్చని చిలుకవంటి మేనిఛాయగలవాడిమీదున్న ప్రీతి చేతనే ఈమె మధురమైన అడిశిల్‌తోబాటు పాలన్నంకూడా తినిపించి చిలుకని పెంచింది. పాశమ్ - అంటే త్రాడు (వల అని కూడా చెప్తారు) దీనికి స్నేహమనే అర్థంకూడా ఉన్నది. శ్రీధరుడివిషయంలో ఉన్న ప్రీతిని వలగా బంధంగా రూపణం చేసి ప్రీతినే గోప్యంగా పాశం అన్నమాటతో చెప్తోందని భావం. కాని ఇప్పుడు కూడా స్నేహంలో కట్టుబడినందున ఇరున్దేన్ అని భూతకాలంగా చెప్పటం కుదరదు. శ్రీధరుడే బంధం అన్నట్లైతే ఆయన కలిసినప్పుడు ఆయనని వదిలి దూర మవటానికిలేకుండా చిక్కుకొనిఉండటాన్ని చెప్పటంవల్ల అది సమంజసం గానే ఉంటుంది. ఇక పాశం అన్నదానికి స్నేహమనే అర్థంకూడా ఉన్నదిగనుక 'శ్రీధరుడి విషయమైన స్నేహంలోఅని" అని రెండో అర్థం కూడా వ్యాఖ్యానంలో సాయించేరన్నమాట.

పైజ్ఞిళివణ్ణిరైక్కుమ్ అనటం "ఈకారణంచేతనే కోకిల చెవిలో మన మాట పడలేదు అని ఈమె అనుకొనటాన్ని చెప్తుంది. కనుక కుఱిక్కొణ్ణు అన్నది తుమ్మెదల గానంలో అది మునిగిపోయి ఉండటంవల్ల తనవిషయాన్ని మళ్ళీ చెప్పినదన్నమాట. కొణ్ణుతరుతల్ అన్నపదానికి నా కంకణాన్ని నాకిచ్చి నేను ధరించేలాగ చెయ్యటం అని అర్థం చెప్తే, ఇరణ్డత్తొన్రు - రెంటిలో ఒకటి - అని చెప్పటానికి కుదరదు. కూసిన తరువాత ఆయన వచ్చి చేరితేనే కంకణం చేతినిపట్టి ఉంటుంది. అందుచేత కూయటం, ఇవ్వటం కలిసే ఉంటాయిగనుక, ఏదో ఒకటి అని చెప్పటం కుదురుతుందా? అందువలన ఆయనని కూసి పిలువు, లేదా ఆయనని విశ్లేషించటంవల్ల జారిపోయిన బంగారు గాజుని ఆయనవద్దకి వెళ్ళి ఇచ్చి ఆవిధంగా నేను ఆయనమీద ఎంతో ప్రేమతో ఉన్నానని, ఆయన విశ్లేషంవల్ల ఆ దుఃఖాన్ని సహించలేక నీరసించిపోతున్నానని, దానివల్లనే గాజులు చేతులనించి జారిపోతున్నాయనీ ఆయనకి తెలియచెయ్యి అని అంటోంది. రెండూ చెయ్యబడవలసినవే. ఇలాంటి ప్రయోగం తమిళకావ్యాల్లో ఒకవిధమైన చమత్కార ప్రయోగం అంటారు. కూస్తేనేకాని ఆయన రాడు. ఆయన రానప్పుడు ఈమెకి కంకణం ఇవ్వటం వ్యర్థం. కనుక జారిపోయిన కంకణాన్ని నాదగ్గరనించి తీసికొని ఆయనకిచ్చెయ్ అన్నట్లైతే తానే కూయటంకూడా చేస్తుందని భావించి ఇట్లా చెప్పిందని వ్యాఖ్యానించేరు. వెనుక చెప్పినవిధంగా తీసుకొన్నట్లైతే, రెంటిలోను ఒకటి అన్నది చక్కగా కుదురుతుంది. ఇంతవరకూ నాకు కావలసినదాన్ని చూసి, ఆయననికూసి పిలవటమేతగినది. ఒకవేళ, "ఇక్కడ తుమ్మెదలు గానం చేస్తూన్న ప్పుడు నువ్వుచెప్పినది నాచెవికి వినిపించలేదు, నేను ఎంబెరుమానుడిని పిలిచి నట్లైతే అక్కడ అన్ని దిక్కులలోనూ నిత్యసూరులు కైంకర్యం చేస్తూ స్తుతించి నట్లుండే ఆయన చెవిలో ఈ పిలుపు పడుతుందా? అందుచేత నేను కుయ్యలేను" అంటున్నావా? లేక కుయ్యటానికి శక్తిలేదని అనుకుంటున్నావా? అలా అయితే, నువ్వు తిన్నగా నా బంగారుకంకణాన్ని తీసుకొని ఆయనదగ్గరకు వెళ్ళి ఇచ్చి రా అని దాని భావం. తీసుకొని ఇవ్వటం కష్టం. కుయ్యటమే చెయ్యనని అది అనుకొని కూస్తుంది అని అంతరార్థం. నా కంకణాన్ని నానుండి తీసికొని ఆయనకి ఇయ్యి అని అర్థం చెప్పినప్పటికీ, పడిపోయినప్పుడల్లా చూసి దాన్ని తీసి నాకిచ్చేలాగ ఉండు ఇట్లా ఎప్పుడూ చెయ్యటం కుదరదే అంటే, అప్పుడు ఆయనని పిలువు అని అర్థంచెప్పవచ్చును. తనచేతి ఆభరణాన్ని చెప్పాలని అనుకున్నప్పుడు

ఆయనచేతికంకణం జ్ఞాపకానికి రావటం చేత, శ్రీధరుడు అన్నట్లు చెప్పకుండా, "శజ్గొడు శక్కరత్తాన్" అని అన్నదన్నమాట. ఆయనకి శంఖచక్రాల్లాగ నాకుకూడా బంగారుకంకణాలు ఎప్పుడూ ఉండవద్దా? ఇట్లా చెయ్యటం న్యాయమేనా అని తెలియచెయ్యి అని అంటున్నది. 9

అవతారిక: పదవ పాశురం- ఈపాశురంలో ఎన్నాళ్ళు ఎన్నివిధాలుగా చెప్పినా తాను కావాలని కోరినవిధంగా నడచుకొనని కోకిలని చూచి కోపంతో ఇలా అంటున్నది.

***మూ. అన్రులకమళన్దానై యుకన్దడిమైక్కణవన్వలిశెయ్య***
***తెన్రలుమ్తిజ్గళుమూడఱుత్తెన్నై నలియుమ్ముఱైమైయఱియేన్***
***ఎన్రుమిక్కావినిలిరున్దిరున్దెన్నై తదైత్తాదే నీయుజ్గుయిలే***
***ఇన్రునారాయణనై వరక్కూవాయేలిజ్గుత్తెనిన్రుమ్ తురప్పన్. 10***

ప్రతిపదార్థం: ***కుయిలే***= ఓ కోకిలా! ***అన్రు***= మహాబలిని అణచివేసిన కాలంలో ***ఉలకమ్***= లోకాలన్నింటినీ ***అళన్దానై***= తనశ్రీపాదాలనుపెట్టి రక్షించిన మహాపురుషుడిని ***ఉకన్దడిమైక్కణ్***= బాగా ప్రశంసించి నేను చేసే కైంకర్యంలో ***అవన్ వలిశెయ్య***= ఆవిష్ణువు చేసిన వంచనచేస్తే ***తెన్రలుమ్***= దక్షిణపుగాలీ, ***తిజ్గళుమ్***= చంద్రుడున్నూ ***ఎన్నై***= నన్ను ***ఊడు అఱుత్తు***= మధ్యకు రెండుగా చీల్చి ***నలియుమ్ముఱైమై***= ఎట్లా హింసిస్తాడో ***అఱియేన్***= మనస్సుతో ఊహించటానికి కూడా సాధ్యం కావటం లేదు (ఈవిధంగా ఉన్నాక) నువ్వుకూడా ***ఎన్రుమ్***= ఎల్లకాలం ***ఇక్కావినిల్***= ఈతోటలోనే ***ఇరున్దిరున్దు***= స్థిరంగా ఉంటూ ***ఎన్నై తదైత్తాదే***= నన్ను హింసించకు ***ఇన్రు వర***= ఈనాడే వచ్చేటట్లు ***నారాయణనై***= నారాయణుడిని ***కూవాయేల్***= పిలవకపోతే ***ఇజ్గుత్తెనిన్రుమ్***= ఇక్కడినుంచి ***తురప్పన్***= తగిలివేయగలను.

వ్యాఖ్యానం- ఆండాళ్‌తాలూకు సామదానభేదోపాయాలేవీ కోకిలదగ్గర పనిచెయ్యలేదు. అందువలన ఇక దండోపాయాన్ని ప్రయత్నిస్తున్నది.

సర్వేశ్వరుడి పరత్వమొక్కటే నామనస్సులోనున్నదిగనుక, ఆయననే

నేనాశపడ్డాను. పూర్వమొకసారి త్రివిక్రమావతారం మిషతో వశిష్ఠచండాలవిభాగం లేకుండా అందరినీ ఉద్ధరించినవాడని విన్నానుగనుక, ఆయన సౌశీల్యగుణం బాగా నిండుగా ఉన్నవాడని తెలుసుకొన్నాను. తనని ఆశించని లోకాలనే ఆయన తనకి ఉపకారం అన్నట్టుగా ఉద్ధరిస్తే ఆశించిన మనలని వదిలివేస్తాడా అని అనుకొని ఆత్రివిక్రముడి శ్రీపాదాలకి నేను కైంకర్యం చేయాలని నేను అనుకుంటే, అది కుదరకుండా కొన్ని ఆటంకాలని ఏర్పరిచి మలయమారుతం, చంద్రుడు మొదలైనవి నన్ను బాధించేవన్నీ ఏకమై, "మనం ఈమెని బాధించటానికి ఇదే సరైన సమయం, పెరుమాళ్ళు ఈమెని వదిలేసిన ఈసమయమే మనం పూర్తిగా బాధించటానికి తగినసమయమౌతుంది" అని నిశ్చయించుకొని అవన్నీ నన్ను పెట్టేబాధలన్నింటినీ నేను నోటితో చెప్పలేను అని ఈమె బాధపడుతూ ఆతోటలో ఉన్న కోకిల తన ఆనందాన్ని చెప్పటానికి మధురంగా పాడుకొనటం మొదలు పెట్టగానే, అది ఈమెని ఇంకాబాధపెట్టటంతో "ఓకోకిలా! దక్షిణపుగాలీ, చంద్రుడూ నన్ను హింసించటంలో న్యాయముందా? దేనికోసం నేనాశపడ్డానో ఆవిషయం తాలూకు గొప్పతనం అది ఎంత అనుభవయోగ్యమో కొంచెమైనా వీటికి తెలిసి ఉంటే, ఇవి పెట్టే హింస ఒకరకంగా భోగ్యమైనదనే అనుకొందును లోకాలనేకొలిచిన ఆశ్రీపాదాలవిశిష్టత ఏమిటో, ఆయనకి చేసే కైంకర్యంతాలూకు విలువ ఏమిటో, తెలుసుకోలేని ఇవి నన్ను హింసించటంలో ఏమి న్యాయ మున్నది? రావణుడు సీతారాములమధ్యని వచ్చి ప్రవేశించి హింసించినట్లు ఈ దక్షిణపుగాలీ, చంద్రుడూ మధ్యనివచ్చి నన్ను బాధించటానికొక పద్ధతి ఉన్నదని నేనెప్పుడూ ఎక్కడా వినలేదని పెరియవాచ్చాన్పిళ్ళైగారి వ్యాఖ్యాన శ్రీసూక్తి. "ఎన్నై నలియుమ్ముఱైమై యఱియేన్" అన్నజాతీయంతో దంపతులని కలపటం వీటికిన్యాయంగాని ఇట్లా బాధించటంన్యాయంకాదు అన్నభావంవస్తుంది. తన కుమారుడైన ఆంజనేయుడికి ఉన్న వివేకంలో పావువంతుకూడా ఈ గాలికి లేదే! అని వాపోతోంది.

కోకిల ఈతోటలో ఉండి ఆనందంగా కూయటమే ఈమె హింస ఎక్కు వవటానికి కారణం అవుతోంది. ఆగాలీ, చంద్రుడూ అప్పుడప్పుడవస్తూపోతూ బాధపెడుతున్నాయిగాని ఈకోకిల ఎడతెరిపిలేకుండా కూస్తూండటమే చేసి అదేపనిగా బాధిస్తున్నదట. ఎంబెరుమానుడి మేనివర్ణం మిమ్ములనేంచేస్తోందని ఈఆండాళే ఇకపైన సాయిస్తున్నది గనుక, కోకిల విరహదశలో సర్వేశ్వరుడి

తిరుమేనిరంగుని తలుచు కుంటూ ఆగకుండా నన్ను బాధిస్తున్నది అని భావం.

"ఇఝ్హుత్తైనిన్ఱుమ్ తురప్పన్" అన్నదానికి 'ఈతోటలోంచి నిన్ను తగిలి వేస్తాను" అని అర్థం అయినప్పటికీ 'నేను ప్రాణాలని పోగొట్టుకుంటున్నాను' అని భావం. నువ్వు నారాయణుడిని రమ్మనిపిలిస్తేతప్ప విరహవేదనతో కృశించిన నేను నశించిపోతాను. ఆతరువాత ఈతోటని నీకు తగినట్లుగా ఉంచేవాళ్ళే ఉండరు గనుక, నీకుండటానికి జాగాలేకుండాపోయి, మరొకచోటు చూసుకొనవలసి వస్తుందని అర్థం. ఇట్లా తురప్పన్ అన్నపదానికి ఈస్థలం నువ్వు విడచి వెళిపోవటానికి తగినట్టవుతుందని చెప్తున్నదన్నమాట. అంటే, ఈవిధంగా చెప్పటంలో "నేను నశించిపోతాను, ఇకనిన్ను జాగ్రత్తగా చూసేవాళ్ళే ఉండరుసుమా! అని చెప్పటం సూచించబడింది..

మలయమారుతం, చంద్రుడూ నన్ను హింసిస్తున్నది చాలా కొంచెమే అయి నువ్వు పెట్టే బాధ మితిమీరి సహించలేనంతగా ఉంది. రాత్రీ పగలూ అనకుండా ఆగకుండా నువ్వు నన్ను హింసిస్తున్నావు. ఇందుకోసమే నేను నిన్నీ తోటలో ఉండటానికి జాగా ఇచ్చేనా? బాగా చేస్తున్నావు ఇంతవరకూ చేసిందేదో చాలు, ఈక్షణంలో ఆ శ్రియఃపతి ఇక్కడికి వేంచేసేలాగ కూసి, ఆయనని ఇక్కడికి రమ్మని పిలువు. లేకపోతే కర్రపట్టుకొని నిన్నీ తోటలోంచి తన్ని తగిలేస్తాను అంటోంది.

అందరూ తనకి దాసులుగనే ఉండాలని తనశ్రీపాదాలతో అందరినీ తానే స్పృశించిన త్రివిక్రముడి కృపని తలంచుకొని ఆనందపడి అటువంటి శ్రీపాదాలకి కైంకర్యం చెయ్యటానికి నేను సిద్ధపడిఉండగా, నన్ను ఆయన వంచించేడే అదిచూసి మందమారుతమూ, చంద్రుడూకూడా నన్ను బాధిస్తున్నాయి. ఆనాడు రాముడు లక్ష్మణుడితో "పద్మసౌగంధికావహం శివం శోకవినాశం। ధన్యా లక్ష్మణ! సేవన్తే పంపోపవనమారుతమ్ - లక్ష్మణా, తామరలవాసనని తెస్తూ పంపానదీ తీరాలమీదినుంచి వస్తున్న ఈచల్లనిగాలిని ధన్యులైనవాళ్ళుమాత్రమే ఆనందించ గలరు సుమా!" అని తనబాధని ఈగాలి ఎక్కువచేస్తోందని అన్నాడు. విరహవేదనచేత బాధపడుతున్న సీతాదేవికి ఉపకరించిన ఉత్తముడి తండ్రియైన వాయుదేవుడికి ఆ బాధించేగుణం లేదు, లక్ష్మీదేవితోపాటు పుట్టిన చంద్రుడుకూడా లక్ష్మీదేవిలాగనే అభిమానిస్తాడు, అని అనుకుంటున్నాను. అతను దేవకికి కంసుడి వంటివాడైనాడని అనుకొనలేదు. ఇప్పుడు అవిరెండూ పెట్టే బాధలకి అంతేలేదు.

ఆబాధ ఇంతమాత్రమని మనస్సులోకూడా అనుకొనటానికి సాధ్యం కావటంలేదు. ఎట్లా చెప్పటం? రాత్రివచ్చే చంద్రుడూ, మధ్యమధ్యని వీచే దక్షిణపుగాలీ ఇట్లా బాధిస్తే రాత్రీ పగలూ ఈతోటలోనే ఉంటూన్న నీకూతలతో నన్ను బాధించటానికి ముందుకివస్తున్నావంటే నేను బతికేదెలా? అందుచేత నన్ను దుఃఖపెట్టకు. నువ్వు నా తోటలో ఉంటూ ఎందుకు నాకనుకూలంగా కూత పెట్టకూడదు? కనుక ఇన్నాళ్ళూ చేసినట్లుకాక, ఇవాళ వటపత్రశాయి వచ్చేటట్లు కూయాలి. లేకపోతే ఇప్పుడే నిన్ను తగిలివేస్తాను చూసుకో అన్నది. దీనికి ముందరి పాశురాల్లోలాగ ఇక్కడకూడా మొదటి పాదాల్లో కోకిలని గురించి చెప్పినవే కాని తనలో తానే చెప్పుకొన్నవి కావు.

అణ్ణలకమళన్దానై యుకన్దు - “నిద్రపోతున్న చంటివాడికి స్తన్యాన్నిచ్చే తల్లిలాగ, ఏమీ తెలియకుండా ఉన్నఈ ప్రజని తానే ఉద్ధరించాలని వాటిని తనశ్రీపాదాలతో స్పృశించిన ఈస్వామిని ఆనందింపచేసి” అని శ్రీపెరియవాచ్చాన్పిళ్ళై సాయించేరు.

ఉకన్దడిమైక్కణ్ - ఉకన్ద+అడిమైక్కణ్ అన్నది ఇట్లా సంకుచితమైంది. కోరిన ఫలం అయిన కైంకర్యం అని దీనికి అర్థం. నేను చేసే కైంకర్యం సామాన్యంగా అందరూ చేసేది కాదు, ఇది నన్ను బ్రతికించి ఉంచుతుంది; ఈకైంకర్యంగాని నాకు లభించకపోతే నేను బ్రతకను అని అంటున్నదని భావం. ఉకన్దు అని విడతీసి ఉకన్దు శెయ్ద - ఆనందంతో చేసిన - అడిమైక్కణ్ అనే పదాన్ని దానితో చేర్చటం. ఉకన్దు అంటే ఉకక్క -ఆనందింపచేసి అన్నమాట. పర్యవసానం - మిగిలిపోయిన మార్పు - “వర్షం కురిసి ధాన్యం మొలకెత్తి” అని చెప్పినట్లు అని కూడా అర్థం చెప్తారు. “శొల్ తిరియినుమ్ పొరుళ్ తిరియా వినైక్కు ఱై” అన్న వ్యాకరణసూత్రం ఇక్కడ తెలుసుకొనదగినది.

అడిమైక్కణ్ - కణ్ అన్నది సప్తమీవిభక్తిప్రత్యయం. కైంకర్యంలో అని అర్థం. వలిశెయ్తల్ - బలంతక్కువవాళ్ళవిషయంలో బలిష్ఠులు అలక్ష్యం చెయ్యటం.

తఱైత్తాతే - అన్నప్పుడు తతర్త్తాతే అనినీ ఇఝుత్తై అన్నదాన్ని ఇఝుత్తు అనినీ చదవటం ఉన్నది.

నారాయణనై - ‘మెన్నడైయన్నమ్’ అన్నపాశురంలో కూసి పిలవమని దగ్గరగానున్న వడపెరుఙ్గోయిలుడైయానే రావాలని కోరుతున్నదన్నది యుక్తంగా కనబడుతుంది. కనుక, “ఏష నారాయణః శ్రీమాన్ క్షీరార్ణవనికేతనః”, “ఆపో నారా

ఇతి ప్రోక్తాః - తేన నారాయణః స్మృతః" అనిచెప్పినట్లు క్షీరాబ్ధిలోనున్నూ, ప్రళయ సముద్రంలోనున్నూ పడుక్కున్నట్టుగాశయనించిఉన్న వడపెరుఙ్గోయిలుడైయాన్నే చెప్పిందనుకొనవచ్చు. ఆయననే లోకాలనికొలిచినవాడా అనిఅక్కడనే అనుసంధి స్తున్నదన్నమాట. 10

అవతారిక: చివరగా ఈ తిరుమొழ்ழిని అభ్యసించినవారికి తమస్వరూపానికి తగినమోక్షపురుషార్థం లభిస్తుందని ఫలనిర్దేశంచేస్తూ తిరుమొழ்ழిని పూర్తిచేస్తున్నది.

***మూ. విణ్ణుఱనీణ్డడితావియమైన్దనై వేఱ్కణ్ మడన్దైవిరుమ్బి***
***క్కణ్ణుఱవెన్కడల్వణ్ణనై క్కూవుకరుఙ్గుయిలేయెన్ఱమాఱ్ఱమ్***
***పణ్ణుఱునాన్మఱైయోర్ పుతువైమన్నన్ పట్టర్పిరాన్కోతైశొన్న***
***నణ్ణుఱువాశకమాలైవల్లార్ నమోనారాయణాయవెన్బారే.***

***ఆణ్డాళ్ తిరువడికళే శరణమ్***

ప్రతిపదార్థం: ***విణ్***= పరమపదం ***ఉఱ***= తగులునట్లుగా ***నీణ్డు***= వృద్ధి చెందు తున్న ***అడి***= శ్రీపాదంతో ***తావియ***= లోకాలని కొలిచిన ***మైన్దనై***= బలముగల యువకుని ***వేల్ కణ్***= బల్లెములచివరలవంటి పొడవైనకన్నులుగల ***మడన్దై***= స్త్రీ ***విరుమ్బి***= ఆశించి ***(కోకిలను చూచి) కరు కుయిలే***= నల్లని ఓ కోకిలా! ***ఎన్ కడల్వణ్ణనై***= సముద్రపురంగులోనున్న నానల్లనివానిని ***కణ్ ఉఱ***= నా కన్నులు ఆయనను చేరునట్లు ***కూవు***= పిలువుమా ***ఎన్ఱ***= అని చెప్పిన ***మాఱ్ఱమ్***= మాటలతో ***పణ్ ఉఱు***= అనేకమైన స్వరములతోచక్కగా అమరియున్న ***నాన్మఱై యోర్***= నాలుగువేదములను వల్లించువారు నివసించు ***పుతువై***= శ్రీవిల్లిపుత్తూరికి ***మన్నన్***= స్వామియైన ***పట్టర్పిరాన్***= పండితులందరకును ఉపకారకులైన పెరియాழ்వారి (కుమార్తెయైన) ***కోతై***= ఆండాళ్ ***శొన్న***= సాయించిన ***నణ్ ఉఱు***= చక్కని,చిక్కనికవిత్వమునగు ***వాశకమాలై***= వాఙ్మాలికయైన ఈతిరుమొழ்ழిని ***వల్లార్*** =అభ్యసించగలిగినవారు ***నమోనారాయణాయ ఎన్బారే***= శ్రీఅష్టాక్షరీ మంత్రము నందు అభినివేశమును కలిగి ప్రకాశించుచుందురు.

వ్యాఖ్యానం: ఈతిరుమొழ்ழిని అభ్యసించినవారు స్వరూపానురూపమైన పురుషార్థాన్నిపొందుతారనిఫలంచెప్పి ఈపాశురంతోఈతిరుమొழ்ழిని ముగిస్తున్నది.

పరమపదం తనకిరీటానికి తగిలేటట్లు ఎత్తుగాపెరిగి బ్రహ్మాండాన్నంతనీ తన పాదంతో కొలిచినవాడి పరత్వం, వాత్సల్యం ఉపకరించి నిరవధికంగా ఉంటాయి. అటువంటి యువకుడే పొడవైన కన్నులుగల తనకు తగినవాడని ఒకస్త్రీ కోరి తాను తనకళ్ళతో చూడవలెనని కోరినచో ఆమె ఎట్లా కోకిలను కూయమని ఆజ్ఞాపించ గలదో, అట్లా నేను చెప్పిన ఈ వాజ్మాలికని అభ్యసించినవారికి నారాయణుడు దగ్గరై ప్రకాశించగా 'నమో నారాయణాయ' అంటూనే కాలమంతా వెళ్ళబుచ్చ గలిగే భాగ్యం కలుగుతుంది.

విణ్ణుర నీణ్డడి తావియ మైన్దనై - అన్నిలోకాలనీకూడా తన రెండడుగుల తోనే కొలిచినవాడు. నీణ్డు, తావియ అనే పదాలప్రయోగం భగవానుడు ఎవరివద్ద నుంచైనా దేనినైనా పొందాలనుకుంటే ఆయని అది పొందే తీరుతాడు. ఆయన వాళ్ళకి ఆపదార్థం ఏమీ మిగలకుండా అంతనూ పూర్తిగా తీసుకుంటాడని దీని భావం. "వేఙ్గడవనై విరుమ్బి" అనిగాని, "శఙ్గొడుశక్కరత్తానై విరుమ్బి" అనిగాని, "పవళవాయనై విరుమ్బి" అనిగాని సాయించకుండా, "విణ్ణుఱ నీణ్డితావియ మైన్దనై విరుమ్బి" అని సాయించటంలో భావమిదే. ఒకరినుంచి దేనినైనా తీసుకొనాలనుకుంటే, తరువాత వాళ్ళకి ఏమీ మిగలకుండా అంతనీ పూర్తిగా తీసుకునేవాడు ఆయన. అటువంటి ఆయనని తాను కోరుకుంటున్నది అని చెప్పట మన్నమాట. తాను యాచిస్తే భూమినిఇచ్చినవారికి ఉండటానికే స్థలం లేకుండా అంతటావ్యాపించి కొలిచిన పాదపద్మములవానిని నేనుకోరినందున సర్వస్వాన్నీ పోగొట్టుకొని మధ్యని నిలిచి కష్టపడవలసి వచ్చింది అని చెప్పినట్లన్నమాట.

వేఱ్కణ్మడన్దై....పట్టర్పిరాన్కోతై విణ్ణుఱ..నీణ్డడితావియ మైన్దన్కణ్ణుఱ విరుమ్బి, కరుఙ్గుయిలే ఎన్కడల్వణ్ణనైక్కూవు" అన్నమాటలు చెప్పితే "నణ్ణుఱువాశకమాలై వల్లార్ నమోనారాయణాయ వెన్బార్" అనే అన్వయం చెప్పవచ్చు. "వేఱ్కణ్మడన్దై కణ్ణుఱవిరుమ్బి" అని చెప్పితే అస్వారస్యంగా ఉంటుందికనుక, "అవన్దన్నై వేలుక్కు ఇరైయాక్కత్తేడుకిఱాళ్" అని పెరియ వాచ్చాన్పిళ్ళై వ్యాఖ్యానించేరు. వేఱ్కణ్ కణ్ణుఱ అని చెప్పటంలో ఆయనని ఈబల్లెంవంటి కన్నులతో నేను వశపరుచుకొనాలి, అందుకోసం ఆయనిక్కడికి రావాలని నువ్వు కూయాలి అని చెప్తోందని భావం.

వేఱ్కణ్మడన్దై - నిజానికి బల్లెపుచివరలవంటి నేత్రములుగల స్త్రీ, గోదాదేవి ఒకరే అయినా, మడన్దై అన్నపదాన్ని కోదై అన్నపదంతో అన్వయించి

అర్థం చెప్పటం పదాలకూర్పుకి కుదరదు. అందుచేత ఉన్నదున్నట్లే చెప్పి వెనకచెప్పినట్లుగనే అర్థం చెప్పుకోవాలి. వేఙ్‌కణ్‌మడన్దై విరుమ్బి అనకుండా, తాన్ విరుమ్బి అని చెప్పితే తనకున్న బల్లెపుచివరలవంటికళ్ళు మొదలైన విశేషాలు చెప్పబడినవి కాకపోవచ్చునని ఈవిధంగా సాయించిందంటారు ఉత్తమూర్‌స్వామి. మడన్దై అంటే యౌవనంలోకింకా అడుగుపెట్టని స్త్రీ, ఇరవైయేళ్ళలోపువయసుగల యువతిని చెప్తుంది. ఈమాటలు లేతదనంతోనున్నయువతి చెప్పినట్లు వయస్సు రాని నేనుచెప్పినమాటలని చెప్పుతున్నదన్నమాట. నిజానికి ఈమె చిన్నవయసు లోని స్త్రీ అయినా, కృష్ణుడు గోపకన్యలతో ఎలా ప్రవర్తిస్తాడో అట్లనే ఈమెతోకూడా ప్రవర్తించేడని ''నాజ్గళెమ్మిలిరున్దొట్టియ కచ్చఙ్గమ్ నానుమవను మఱితుమ్'' అని యౌవనంలోఉన్నయువతి చెప్పినట్లు చెప్పి తెలియచేసింది.

తావియ మైన్దనై వేఙ్‌కణ్‌మడన్దై - లోకమంతా నడిచివచ్చినవాడికి మాలాంటి పొడవైనకళ్ళున్న స్త్రీలు మరెవరూ ఈ లోకంలో లేరని తెలుసును అని చెప్తోందన్నమాట.

నణ్ణుఱు - అంటే దగ్గరవటానికి తగిన - అందరూ ఆశించదగిన - భోగ్యమైన అని చెప్పటమన్నమాట. సర్వేశ్వరుడికి దగ్గరవటానికి తగినటువంటి వాఙ్మాల అని అర్థం చెప్పుకొనవచ్చు. సర్వేశ్వరుడి గుణాలని చెప్ప ప్రారంభించిన వేదం ''యతో వాచో నివర్తన్తే, అప్రాప్య మనసా సహ'' అని సాయించినట్లు చేజారి పోయిన దానిలాగ కాకుండా, ఆయనగుణాలు మొదలైనవాటికి చక్కగా దగ్గర వటానికి (ప్రతిపాదించటానికి) తగిన వాఙ్మాల అని భావం.

నమో నారాయణాయ వెన్బారే - ''పల్లాణ్డెన్ఱు పవిత్తిరనై... నల్లాణ్డెన్ఱు నవిన్ఱు రైప్పార్ నమోనారాయణావెన్ఱు పల్లాణ్డుమ్ పరమాత్మనై శూழ்న్దిరున్దు పల్లా ణ్డేత్తువర్''అని ఈమెతండ్రిగారు సాయించటాన్నిగమనించండి. పల్లాండుపాడటానికి అవకాశం లభించినవారు అన్నమాట. తిరుమంత్రపు అర్థంలో నిష్ఠని కలిగిన వారౌతారని చెప్పవచ్చు. తిరువష్టాక్షరినినుసంధించేవారికి ఏమి ఫలమో అదే ఈ పదిపాశురాలనీ అనుసంధించగలిగినవారికికూడా ఫలమన్నమాట. ఈ తిరుమొழிని అనుసంధించినవారున్నూ, నమో నారాయణాయ అని అనుసంధానం చేస్తూండే వారున్నూ తుల్యులేనని సాయించబడుతున్నదని అర్థం. 11

ఆణ్డాళ్ తిరువడికళే శరణమ్.